# విశాల భారతి

30-01-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 28


## గద్దెలపై కొలువుదీరిన
# సమ్మక్క తల్లి

- మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరుగుతోంది
- సమ్మక్క తల్లి జనం వైపు అడుగులు వేసింది
- అడవి తల్లీ ఆశీస్సుల కోసం లక్షలాది మంది భక్తులు
- పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి
- జాతరలో తొలి అంకం విజయవంతంగా పూర్తయింది
- ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు
- తడి బట్టలతోనే గద్దెల వద్దకు చేరుకుంటున్నారు

04





# వృద్ధి బాటలో భారత్

ఆర్థిక సర్వేను మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారు

- ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన పునాదులపై నిలబడి ఉందని స్పష్టం
- భారత్ మరింత వేగంగా దూసుకుపోగలదని పేర్కొంది
- దేశ రియల్ జీడీపీ 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం
- ఆర్థిక ప్రగతికి ఎటువంటి ధోకా లేదని భరోసా కల్పించింది
- భారత్ నిలకడైన వృద్ధిని నమోదు చేయగలిగింది

**విశాలభారతి, జాతీయం:**

దేశ ఆర్థిక గమనానికి అత్యంత కీలకమైన పత్రంగా భావించే ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత ఏడాది కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన ప్రగతిని సమీక్షిస్తూనే, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఈ సర్వే కళ్లకు కట్టింది. ప్రస్తుత ప్రపంచ పరిణామాలు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్టమైన పునాదులపై నిలబడి ఉందని సర్వే స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన వృద్ధిరేటు కంటే ముందుండు భారత్ మరింత వేగంగా దూసుకుపోగలదని ఈ నివేదికలో పేర్కొనడం గమనార్హం. ముఖ్యంగా 202627 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్య వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. దేశీయంగా డిమాండ్ స్థిరంగా ఉండటం, స్థూల ఆర్థిక సూచీలు సానుకూలంగా కొనసాగడం వల్ల ఈ అంచనాలు సాధ్యమవుతాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధి మందగించినా, మన దేశంలో వినియోగం , ప్రభుత్వ వ్యయం సమపాళ్లలో ఉండటం వల్ల భారత ఆర్థిక ప్రగతికి ఎటువంటి ఢోకా లేదని ప్రభుత్వం ఈ పత్రం ద్వారా భరోసా కల్పించింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని సర్వే అభిప్రాయపడింది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక వృద్ధి నిలకడగా లేకపోవడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటం వంటి అంశాలు



అంతర్జాతీయ మార్కెట్లపై నీడలు పరుస్తున్నాయి. ప్రతికూల అంశాల ప్రాబల్యం పెరుగుతున్న తరుణంలో ప్రపంచ ఆర్థిక ప్రగతి కేవలం ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగే ప్రమాదం ఉందని ఈ నివేదిక హెచ్చరించింది. అయితే అదృష్టవశాత్తూ అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల ధరలు ఈ ఏడాది కాస్త స్థిరంగా ఉండవచ్చని అంచనా వేయడం మనకు సానుకూలించే అంశం. సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న కృత్రిమ మేధ గురించి కూడా ఆర్థిక సర్వే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఏఐ వల్ల ఆశించిన స్థాయిలో ఆర్థిక ఫలాలు అందకపోతే, ఆస్తుల విలువలు ఒక్కసారిగా పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దీనివల్ల ఆర్థిక రంగంపై ఒత్తిడి పెరిగి బ్యాంకింగ్, పెట్టుబడి

మిగతా 2లో..

# ఇప్పుడు రాలేను..!

## ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది

**తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం తాజాగా సరికొత్త మలుపు తిరిగింది. ఈ కీలక కేసులో విచారణ ఎదుర్కోవాలని ప్రత్యేక దర్యాప్తు బృందం జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు స్పందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగి, రాజకీయం వేడెక్కిన తరుణంలో ఆయన సిట్ అధికారులకు సుదీర్ఘ లేఖ రాశారు.**

**శుక్రవారం నాటి విచారణకు తాను హాజరుకాలేనని స్పష్టం చేస్తూనే, దర్యాప్తుకు సహకరించే విషయంలో తనకు ఎలాంటి అభ్యంతరాల్లేవని ఆయన తేల్చిచెప్పారు. చట్టంలోని లోతుపాతులను, రాజకీయ విధులను సమన్వయం చేసుకుంటూ ఆయన పంపిన ఈ వివరణ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.**

- సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు
- కేసీఆర్ సిట్ అధికారులకు సుదీర్ఘ వివరణ ఇచ్చారు
- విచారణకు హాజరుకాలేనని కేసీఆర్ స్పష్టం చేశారు
- దర్యాప్తుకు సహకరించేందుకు అభ్యంతరం లేదని వెల్లడి
- ఎర్రవల్లిలోని తన నివాసానికే రావాలని సూచించారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికల ప్రక్రియ శరవేగంగా సాగుతోందని, ఈ కీలక సమయంలో పార్టీ బాధ్యతలు తనపై ఉన్నాయని కేసీఆర్ గుర్తుచేశారు. అభ్యర్థుల ఎంపిక, బీఫారాల పంపిణీ, వ్యూహరచనలో తాను క్షణం తీరిక లేకుండా గడుపుతున్నానని వివరించారు. నామినేషన్ల గడువు ముగుస్తున్న క్రమంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాల్సిన గురుతర బాధ్యత తనపై ఉందని, అందుకే వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావడం సా ధ్యపడదని ఆయన వెల్లడించారు. రాజకీయ ప్రయో జనాల కంటే చట్టం పట్ల గౌరవం ఉన్నప్పటికీ, ఎన్నికల నిర్వహణ వంటి రాజ్యాంగబ ద్ధమైన ప్రక్రియలో ఉన్నందున ఈ వెసులుబాటు కో రుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ భారత శిక్షాస్మృతిలోని సాంకేతిక అంశాలను ప్రస్తావించడం గమనార్హం. సీఆర్‌పీసీ సెక్షన్ 160 ప్రకారం దర్యా ప్తు సంస్థలు సాక్షులను విచారించే విషయంలో కొన్ని స్పష్టమైన వెసు లుబాట్లు ఉన్నాయని ఆయన గుర్తుచే శారు. ముఖ్యంగా 65 ఏళ్లు పైబడిన వ్యక్తులు, మహిళలు, దివ్యాంగులను వారు నివసించే ప్రాంతం దాటి విచారణకు పిలవకూడదన్న నిబంధనను ఆయన లేఖలో ఉదహరించారు. వయోభారం దృష్ట్యా తనకు ఈ మినహాయింపు వర్తిస్తుందని, చట్టాన్ని అతిక్రమించే ఉద్దేశం తనకు లేదని ఆయన పకడ్బందీగా వివరించారు. తన హక్కులను కాపాడుకుంటూనే దర్యాప్తుకు తన సంసిద్ధతను చాటుకోవడం రాజకీయ వర్గాల్లో విశ్లేషణలకు తావిస్తోంది.




మిగతా 2లో..

# డేంజర్ జోన్‌లో మేడిగడ్డ

- జలాశయాల భద్రతపై కేంద్రం హెచ్చరిక
- ప్రమాదకర స్థితిలో మేడిగడ్డ బ్యారేజీ
- మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చోటు
- పెను ప్రమాదాలు సంభవించే అవకాశం
- ఎన్‌డీఎస్‌ఏ తన నివేదికలో స్పష్టం చేసింది
- రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశం



03

# 'కేసీఆర్ నా బాస్'

- ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు
- మా బాస్ కేసీఆర్ అంటూ సంబోధించారు
- దీని వెనుక ఆంతర్యం ఏమిటనే గుసగుసలు
- అప్పట్లో రాజశేఖర్ రెడ్డి బాస్ అని అన్నారు
- అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే చర్చ.. అదే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు. మొన్నటి వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన ఈటల, ఇప్పుడు ఒక్కసారిగా "మా బాస్ కేసీఆర్" అంటూ సంబోధించడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. బీజేపీలో కీలక నేతగా ఎదిగి, ఎంపీగా విజయం సాధించిన ఆయన నోటి నుంచి ఈ మాటలు రావడం వెనుక ఆంతర్యం ఏమిటనే దానిపై విశ్లేషణలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూ తన పని తాను చేసుకుపోతున్న ఈటల, ఒక్కసారిగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం

మిగతా 2లో..

# దేశాభివృద్ధికి కలిసి రండి

అమెరికా పర్యటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు
- మాతృభూమి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు
- విజయానికి సోపానాలుగా మార్చుకోవాలని వెల్లడి
- నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని దిశానిర్దేశం
- హైదరాబాద్ ఐటీ రంగంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా, ఆశించిన లక్ష్యాల దిశగా సాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను విశ్వవ్యాప్తం చేయడమే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో ఒక కీలక ఘట్టం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ముఖ్యమంత్రి పర్యటించడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. అగ్రరాజ్యంలోని మేధావుల వేదికపై తెలంగాణ గళాన్ని వినిపిస్తూ, భావి భారత పౌరుల్లో సరికొత్త స్ఫూర్తిని నింపేందుకు ఆయన చేసిన ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. హార్వర్డ్ యూనివర్సిటీలోని భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి ఆ ప్రాంగణానికి విచ్చేశారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం అత్యంత ఆసక్తికరంగా సాగింది. విదేశీ గడ్డపై ఉన్నప్పటికీ, తమ మాతృభూమి అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే తపన ఉన్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ పర్యటన కేవలం పారిశ్రామిక ఒప్పందాలకే పరిమితం కాకుండా, విద్యావేత్తలు, యువ మేధావులను రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములను చేసే ఒక గొప్ప వారధిగా నిలిచింది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో రేవంత్‌రెడ్డి తన వ్యక్తిగత, రాజకీయ ప్రస్థానాన్ని ఎంతో నిజాయతీగా వివరించారు. ఒక సాధారణ నేపథ్యం నుంచి వచ్చి, అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం వెనుక ఉన్న కష్టాన్ని ఆయన నెమరు వేసుకున్నారు. తన ప్రయాణంలో ఎదురైన ఒడిదొడుకులు, సవాళ్లే తనను బలవంతుడిని చేశాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కూడా తమ కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే చిన్న చిన్న వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటిని విజయానికి సోపానాలుగా మార్చుకోవాలని ఆయన హితబోధ చేశారు.

విజయం అనేది కేవలం అదృష్టం వల్ల మాత్రమే సిద్ధించేది కాదని, దానికి నిరంతర కృషి, అంకితభావం తోడవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్వర్డ్ వంటి దిగ్గజ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఉండాల్సిన ప్రాథమిక లక్ష్యం లక్ష్యం పట్ల స్పష్టత అని ఆయన గుర్తుచేశారు. కష్టపడే తత్వం ఉన్నవారికి అవకాశాలు వాటంతట అవే వస్తాయని, ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకున్నప్పుడే నాయకత్వ లక్షణాలు అలవడతాయని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి మాటలు విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో

మిగతా 3లో..

# కేసీఆర్‌ను టచ్ చేస్తే అగ్నిగుండమే

## రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు ఉత్కంఠ రేపుతోంది



02



# దోషులు ఎవరో తేలాల్సిందే

- ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు స్పందించారు
- కేసీఆర్‌ను ఒక ఉద్యమ నాయకుడిగా గౌరవిస్తాము
- చట్టం ముందు ఎవరూ అతీథులు కారని స్పష్టం
- ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్రమైన నేరం
- క్షమించరాని విషయమని ఆయన పేర్కొన్నారు
- బాధ్యులను శిక్షించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వెల్లడి

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ పరిణామంపై అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఈ వ్యవహారంపై తన

మిగతా 3లో..

# 'కేసీఆర్ నా బాస్'

**మొదటిపేజీ తరువాయి**



రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో తాజాగా జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల రాజేందర్, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాల్లో తనకు కులం, మతం లేవని, కేవలం ప్రజల శ్రేయస్సే తన పరమావధి అని ఆయన స్పష్టం చేశారు. తనకు వచ్చిన పదవులు తన తల్లిదండ్రులు ఇచ్చినవి కావని, ప్రజల దీవెనలు, వారిచ్చిన బలంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని, తనతో ఉండటం వల్ల ఎవరికీ నష్టం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.

ఈ ప్రసంగం మధ్యలో ఆయన గత రాజకీయ అనుభవాలను ప్రస్తావిస్తూ.. అప్పట్లో రాజశేఖర్ రెడ్డి బాస్ అని, అదే విధంగా మా బాస్ కేసీఆర్ అంటూ ప్రస్తావించారు. ఈ మాట విన్న వెంటనే సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడున్నవారు జై కేసీఆర్, జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేయడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బీజేపీ ఎంపీ హోదాలో ఉండి కేసీఆర్‌ను 'బాస్' అని పిలవడం వెనుక రాజకీయ వ్యూహం ఉందా లేక యాదృచ్ఛికంగా అన్న మాటలా అనే చర్చ సాగుతోంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. రాజకీయ అంశాలను పక్కన పెడితే, మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధిపై ఈటల రాజేందర్ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా దశాబ్దాలుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నేరేడ్‌మెట్ ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. దీని కోసం భారీ నిధులను మంజూరు చేయించడంలో ఆయన సఫలీకృతమయ్యారు.

నేరేడ్‌మెట్ ప్రాంతంలో ఆర్‌యూబీ, ఎల్‌హెచ్‌ఎస్ నిర్మాణాలకు ఈటల రాజేందర్ భూమిపూజ చేశారు. సుమారు 80 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టులను చేపట్టడం విశేషం. ఈ నిర్మాణాలకు అవసరమైన నిధులను దక్షిణ మధ్య రైల్వే సమకూరుస్తోందని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గరిష్టంగా నిధులు రాబట్టి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ పనులు పూర్తయితే మల్కాజిగిరి రూపురేఖలు మారిపోతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టుల కాలపరిమితిపై కూడా ఈటల స్పష్టతనిచ్చారు. రాబోయే రెండు సంవత్సరాల్లోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద రైలు వచ్చే సమయంలో గంటల తరబడి వేచి చూడాల్సిన నరకయాతన ఇకపై తప్పుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం ట్రాఫిక్ సమస్యలే కాకుండా, రైల్వే గేట్ల వద్ద జరుగుతున్న చిన్న చిన్న ప్రమాదాలను నివారించడానికి ఈ నిర్మాణాలు ఎంతో దోహదపడతాయని ఆయన వివరించారు. ఈ పనుల ప్రారంభంతో మల్కాజిగిరి వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనుల మాట ఎలా ఉన్నా, రాజకీయంగా ఈటల చేసిన వ్యాఖ్యలు మాత్రం ఇంకా ప్రకంపనలు సృష్టిస్తూనే ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన సమయంలో ఆయన కేసీఆర్‌పై చేసిన విమర్శలు అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలో గెలిచి తన సత్తా చాటుకున్నారు. ఇప్పుడు మళ్ళీ అదే కేసీఆర్‌ను గౌరవపూర్వకంగా బాస్ అని పిలవడం వెనుక ఉన్న అంతరార్థాన్ని విశ్లేషకులు రకరకాలుగా అంచనా వేస్తున్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ స్నేహానికి సంకేతాలా లేక కేవలం సందర్భోచితంగా వచ్చినవేనా అన్నది తేలాల్సి ఉంది. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఈటల చెబుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎంపీగా తనకు ఉన్న పరపతిని ఉపయోగించి మల్కాజిగిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయం ఏదైనా అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అందుకే పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోవాలనే ఉద్దేశంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసి ఉండవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద ఈటల రాజేందర్ తనదైన శైలిలో అటు అభివృద్ధిని, ఇటు రాజకీయాన్ని సమతుల్యం చేస్తున్నారు.

నేరేడ్‌మెట్ ప్రాంతంలో ప్రారంభమైన ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే ఈ రూట్ లో ప్రయాణించే వేలాది మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, స్కూల్ బస్సులకు ట్రాఫిక్ చిక్కుల నుంచి విముక్తి కలుగుతుంది. మౌలిక సదుపాయాల కల్పనలో తన వంతు పాత్ర పోషిస్తానని చెబుతున్న ఈటల, ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులపై ఒత్తిడి తెస్తానని ఆయన సభాముఖంగా వెల్లడించారు. ఈటల రాజేందర్ ఒకవైపు అభివృద్ధి పనులతో ప్రజల మనసు గెలుచుకుంటూనే, మరోవైపు తన రాజకీయ వ్యాఖ్యలతో చర్చల్లో నిలుస్తున్నారు. "బాస్ కేసీఆర్" అన్న మాటతో ఆయన తన పాత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారా లేక తెలంగాణ రాజకీయాల్లో ఏదైనా కొత్త మార్పునకు ఇది శ్రీకారమా అనేది కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతం మాత్రం మల్కాజిగిరిలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. ఈ రాజకీయ పరిణామాలపై ముమ్ముందు ఇంకెన్ని మలుపులు ఉంటాయో వేచి చూడాలి.



ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాదవ రెడ్డి గారికి నూతన సంవత్సర క్యాలెండర్ అందజేసిన విశాల భారతి దినపత్రిక ఎడిటర్ అశోక్..

ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ విశాల భారతి దినపత్రిక నుండి ప్రతి ఆదివారం వెలువడే రియల్ టాక్ అనే పేజీ చాలా అద్భుతంగా ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మంచి మంచి సమాచారం అందించే ఆ పేజీ మాలాంటి వ్యాపారస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు.

-విశాల భారతి, హైదరాబాద్

# అవినీతి రెవెన్యూ అధికారుల రాతలకు బలైన రైతులు

**రామాయంపేట, విశాలభారతి:** రెవెన్యూ అధికారుల అవినీతి రాతల కారణంగా ఉమ్మడి బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన 14 మంది రైతులు తమ భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 250 నుంచి 283 వరకు విస్తరించిన 135 ఎకరాలు 25 గుంటల భూమిని దళారులు బినామీ పేర్లతో అక్రమంగా పట్టా మార్పిడి చేసినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ భూముల విషయంలో 1975లో ప్రత్యేక అధికారిని నియమించి విచారణ చేపట్టగా, మెదక్ ట్రిబ్యునల్ ప్రత్యేక అధికారి నివేదిక ఆధారంగా 1975 ల్యాండ్ రిఫార్మ్స్ - మెదక్ LCC నంబర్ 985/MDK/75 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో పూర్వాపరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం, అప్పటి రికార్డుల్లో రైతులకు టెనెన్సీ యాక్ట్ 1950 - సెక్షన్ 38(E) ప్రకారం భూమిపై హక్కులు కల్పించారు. అయితే, రైతులకు పూర్తి అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ప్రస్తుత దళారులు మరియు కొందరు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై చట్ట విరుద్ధ మార్గాల్లో బినామీ రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది.

# వృద్ధి బాటలో భారత్

**మొదటిపేజీ తరువాయి**



రంగాల్లో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని విశ్లేషించింది. కేవలం సాంకేతికతపైనే భారం వేయకుండా, సంప్రదాయ ఉపాధి మార్గాలను కూడా కాపాడుకుంటూ ముందుకు సాగాలని సర్వే సూచించింది. అంతర్జాతీయ వేదికపై నెలకొన్న భౌగోళిక అనిశ్చితుల కారణంగా విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. దీనివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి భారతదేశ పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో గ్లోబల్ సరఫరా గొలుసులో తలెత్తే అంతరాయాలు ఇబ్బందికరంగా మారవచ్చు. రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే ప్రమాదం ఉందని, అందుకే ముందుస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక సర్వే అంచనా వేసింది. అమెరికా వంటి పెద్ద దేశాలు విధించిన సుంకాల భారం భారత్‌పై ఒత్తిడి పెంచినప్పటికీ, మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండటం విశేషం. సాధారణంగా ఇలాంటి సుంకాల విధింపు జరిగినప్పుడు జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గుముఖం పట్టడం సహజం. కానీ భారత విషయంలో వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ప్రపంచ దేశాల నుంచి ఎదురైన వాణిజ్య సవాళ్లను ఎదుర్కొని భారత్ నిలకడైన వృద్ధిని నమోదు చేయగలిగింది. ఇది మన దేశ ఎగుమతి రంగం యొక్క స్థితిస్థాపకతకు మరియు పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమని సర్వే కొనియాడింది. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా చేపట్టిన వ్యవస్థాగత మార్పులు ఇప్పుడు సత్ఫలితాలనిస్తున్నాయి. పన్నుల విధానంలో సంస్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన మరియు విధానపరమైన కఠిన నిర్ణయాల వల్ల సుంకాల భారాన్ని భారత్ సమర్థవంతంగా తట్టుకోగలిగిందని సర్వే అభిప్రాయపడింది. సంక్షోభ సమయాల్లోనూ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలే కారణమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఈ పరిణామాలు భారతీయ మార్కెట్లపై విదేశీ ఇన్వెస్టర్లకు నమ్మకాన్ని పెంచడంలో దోహదపడ్డాయి.

వ్యవసాయ రంగంలో కూడా మెరుగైన వృద్ధిని సాధించాల్సిన అవసరాన్ని సర్వే గుర్తు చేసింది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవడం వల్ల ఆహార భద్రతతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొంది. అదే సమయంలో తయారీ రంగానికి ఊతమిచ్చేలా 'మేక్ ఇన్ ఇండియా' వంటి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించింది. దీనివల్ల నిరుద్యోగ సమస్య తగ్గడమే కాకుండా దేశం ఎగుమతుల కేంద్రంగా మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేసింది. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం. నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉండేలా ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ మధ్య సమన్వయం అవసరమని సర్వే పేర్కొంది. గ్లోబల్ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గులు మన ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతాయి కాబట్టి, ఇంధన వనరుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడంలో భారత్ వేగంగా స్పందిస్తోందని వెల్లడించింది. ఇది దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వానికి దారితీస్తుందని సర్వే విశ్లేషించింది. ముగింపుగా చూస్తే, 202627 ఆర్థిక సంవత్సరం భారత్‌కు కీలకమైనదిగా కనిపిస్తోంది. ప్రపంచ సవాళ్లు ఎన్ని ఉన్నా, అంతర్గత శక్తుల ఆధారంగా వృద్ధి పథంలో సాగడానికి మన దేశం సిద్ధంగా ఉందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందేలా చూడటమే ప్రభుత్వ తదుపరి లక్ష్యంగా ఉండాలని ఈ నివేదిక సూచించింది. రాబోయే బడ్జెట్ ప్రతిపాదనలకు ఈ సర్వే అంచనాలు ఒక గట్టి పునాదిని వేయనున్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

# ఇప్పుడు రాలేను..!

**మొదటిపేజీ తరువాయి**




చట్టపరమైన పరిమితులను దృష్టిలో ఉంచుకుని తనను విచారించాలనుకుంటే సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసానికే రావాలని కేసీఆర్ పోలీసు అధికారులకు సూచించారు. నిబంధనల ప్రకారం సీనియర్ సిటిజన్లను వారి నివాసం వద్దే విచారించాల్సి ఉంటుందని, కావున తన ఫామ్‌హౌస్‌లోనే విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దర్యాప్తు బృందం తమ వెసులుబాటును బట్టి మరో తేదీని ఖరారు చేసి, ముందస్తు సమాచారంతో తన వద్దకు రావచ్చని ఆయన తెలిపారు. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థలకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని, అడిగే ప్రతి ప్రశ్నకు జవాబిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రానికి దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా సేవలు అందించానని, ప్రస్తుతం శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన హోదాలో ఉన్నానని కేసీఆర్ తన లేఖలో నొక్కి చెప్పారు. వ్యవస్థల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని, అయితే దర్యాప్తు అంతా చట్టం కల్పించిన వెసులుబాటు పరిధిలోనే సాగాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో తనకు ఎలాంటి నోటీసులు పంపినా లేదా సమాచారం కావాలన్నా ఎర్రవల్లి నివాసానికే పంపాలని అధికారులకు స్పష్టం చేశారు. దీని ద్వారా విచారణ వేదికను తన నివాసానికి మార్చుకోవడంలో ఆయన కృతకృత్యులయ్యారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ లేఖతో ఇప్పుడు బంతి సిట్ అధికారుల కోర్టులోకి చేరింది. చట్టం ప్రకారం ఆయన నివాసానికే వెళ్లి విచారిస్తారా లేక ఉన్నతాధికారుల సలహా మేరకు మరో నిర్ణయం తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. కేసీఆర్ ఎక్కడా విచారణకు భయపడటం లేదని, కేవలం చట్టం కల్పించిన హక్కులను మాత్రమే వినియోగించుకుంటున్నారని ఆయన మద్దతుదారులు వాదిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులు కటకటాల పాలైన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణం మూలాలు ఎక్కడ ఉన్నాయనే కోణంలో సిట్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. రాజకీయ ప్రముఖుల ప్రమేయంపై పక్కా ఆధారాలు సేకరిస్తున్న క్రమంలోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో కేసీఆర్ పంపిన వివరణపై ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు ఎలా స్పందిస్తాయనేది వేచి చూడాలి. ముఖ్యంగా విచారణ తేదీని ఎప్పుడు ఖరారు చేస్తారు, ఏయే అంశాలపై ఆయన్ను ప్రశ్నిస్తారు అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ ఈ పరిణామాలు ఓటర్ల తీర్పుపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న చర్చ మొదలైంది. ఒకవైపు ప్రచార పర్వం, మరోవైపు దర్యాప్తు ఒత్తిడి మధ్య బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. కేసీఆర్ తన లేఖ ద్వారా తన పంథాను స్పష్టం చేయడంతో, తదుపరి చర్యల కోసం సిట్ నివేదిక సిద్ధం చేస్తోంది. చట్టం అందరికీ సమానమేనని, బాధ్యులెవరైనా వదిలిపెట్టమని ప్రభుత్వం చెబుతుండగా, ఇదంతా రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ప్రతిపక్షం ఎదురుదాడికి దిగుతోంది. చివరగా, తన విచారణ అంశాన్ని కేసీఆర్ అత్యంత చాకచక్యంగా చట్టం, ఎన్నికల విధులతో ముడిపెట్టారు. చట్టసభ సభ్యుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా తనకు ఉన్న హక్కులను ప్రస్తావిస్తూనే, దర్యాప్తుకు తన సానుకూలతను చాటుకున్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా విచారణ జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుండగా, సిట్ అధికారులు దీనిపై న్యాయ నిపుణులతో మంతనాలు జరుపుతున్నారు. రేపటి నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ కేసులో మరిన్ని సంచలన పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతానికి కేసీఆర్ లేఖ రాజకీయ చదరంగంలో ఒక ఎత్తుగడగా కనిపిస్తోంది. వయోభారాన్ని, చట్టంలోని రక్షణ కవచాలను ఆయన సమర్థవంతంగా వినియోగించుకున్నారు. విచారణను ఎదుర్కోవడానికి తాము సిద్ధమని సంకేతాలు పంపడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. అటు సిట్ అధికారులు సైతం పకడ్బందీగా ముందుకు సాగుతుండటంతో, ఈ ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఇటు రాజకీయంగా, అటు న్యాయపరంగా రాష్ట్రంలో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# కేసీఆర్‌ను టచ్ చేస్తే అగ్నిగుండమే

- రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు ఉత్కంఠ రేపుతోంది
- కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం సంచలనంగా మారింది
- దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి
- ప్రభుత్వంపై హరీశ్ రావు, కేటీఆర్ మండిపడ్డారు
- కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యేనని ధ్వజమెత్తారు
- సీఎం రేవంత్ రెడ్డి చరిత్రహీనుడని విమర్శించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై భారత రాష్ట్ర సమితి శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యేనని, కేసీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుతున్న కుతంత్రమని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ వంటి మహోన్నత నాయకుడిని తాకడం అంటే అది కేవలం ఒక వ్యక్తిని టచ్ చేయడం కాదని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని సవాల్ చేయడమేనని హరీశ్ రావు హెచ్చరించారు. దశాబ్దాల సుదీర్ఘ పోరాటంతో రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన చారిత్రక నాయకుడిపై బురద చల్లాలని చూడటం అంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ఒక చరిత్రను సృష్టించిన నాయకుడని, అటువంటి నేత చరిత్రను మలినం చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి చివరకు ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, పరిపాలనా చేతకానితనం వల్ల ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఇటువంటి కుట్రలకు తెరలేపిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం వంటి వివాదాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ట అని వారు దుయ్యబట్టారు. రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి, ప్రతిపక్ష నేతలను వేధించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందవచ్చనే దురాలోచనతోనే ప్రభుత్వం ఈ తరహా చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు విశ్లేషించారు. అధికార గర్వంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డికి తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెబుతుందని ఆయన హెచ్చరించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలు క్షమించరని ఆయన హితవు పలికారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంట ఉందని, ఇటువంటి బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ ఎన్నడూ భయపడబోదని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఏడాది పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ తంతు నడుపుతోందని ఆయన ఆరోపించారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేతపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు చేయలేక ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణను పదేళ్లలో దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ కొనియాడారు. సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి పథకాలతో ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నాయకుడిని ఇలాంటి నోటీసులతో కించపరచలేరని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక విజనరీ అని, ఆయన సృష్టించిన సంపదను, తెచ్చిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేరని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని బీఆర్ఎస్ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి. విచారణ సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను అణగదొక్కాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తన వైఫల్యాలను ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని చూస్తోందని, కానీ ఉద్యమ గడ్డపై అణచివేత సాగదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేయడం ద్వారా ప్రజల సమస్యలను దాచిపెట్టలేరని హితవు పలికారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ప్రభుత్వం అభివృద్ధి కంటే విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కనబెట్టి, కేసీఆర్ వంటి భారీ ఇమేజ్ ఉన్న నాయకుడిని చుట్టుముట్టడం ద్వారా రాజకీయ మైలేజ్ సాధించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇలాంటి చర్యలు బెడిసికొట్టే అవకాశం ఉందని, ప్రజల్లో కేసీఆర్ పట్ల ఉన్న సానుభూతి మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీఆర్ఎస్ నాయకత్వం ఈ నోటీసులను న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క అసలు రంగును బయటపెడతామని వారు శపథం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిపై జరుగుతున్న ఈ దాడిని తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంగా మలుస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఈ పరిణామంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం. మొత్తానికి కేసీఆర్‌కు సిట్ నోటీసుల అంశం తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పంతం నెగ్గించుకోవాలని చూస్తుంటే, బీఆర్ఎస్ పార్టీ ప్రజా మద్దతుతో దీనిని తిప్పికొట్టాలని భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల ముంగిట జరుగుతున్న ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఎటువంటి మలుపులు తిరుగుతాయోనని సామాన్య ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ప్రజా పక్షాన నిలబడి అన్యాయమైన పాలనపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కేటీఆర్, హరీశ్ రావు వెల్లడించారు.






# డేంజర్ జోన్‌లో మేడిగడ్డ

**విశాలభారతి, జాతీయం:**

దేశవ్యాప్తంగా ఉన్న జలాశయాల భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన గణాంకాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చేరడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ఈ సంచలన విషయాలను బయటపెట్టారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ 2025 వర్షాకాలం ముగిసిన తర్వాత నిర్వహించిన క్షేత్రస్థాయి తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలోని మూడు ప్రధాన జలాశయాలను 'కేటగిరీ 1' కింద వర్గీకరించారు, అంటే ఇవి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయని అర్థం. ఈ జాబితాలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీతో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ చోటు చేసుకున్నాయి. ఈ మూడు జలాశయాల విషయంలో తక్షణమే నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని కేంద్రం హెచ్చరించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ పరంగా తీవ్రమైన లోపాలను ఎదుర్కొంటోందని ఎన్‌డీఎస్‌ఏ తన నివేదికలో స్పష్టం చేసింది. గతంలో ఈ బ్యారేజీకి సంబంధించిన పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు రావడం వంటి ఘటనలు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం దీనిని కేటగిరీ 1లో చేర్చడం ద్వారా పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరమ్మతుల విషయంలో ఏమాత్రం జాప్యం జరిగినా, అది దిగువన ఉన్న గ్రామాలపై, ప్రజల ఆస్తిపాస్తులపై తీవ్ర ప్రభావం చూపే ముప్పు పొంచి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 నిబంధనల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు, తర్వాత అన్ని జలాశయాలను తనిఖీ చేయడం తప్పనిసరి. ఈ క్రమంలోనే 2025లో వర్షాకాలం కంటే ముందు 6,524 డ్యామ్‌లను, వర్షాకాలం ముగిశాక 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లోనే మేడిగడ్డ బ్యారేజీలో ఉన్న నిర్మాణ లోపాలు, భద్రతా పరమైన వైఫల్యాలు బయటపడ్డాయి. దీనిపై యుద్ధ ప్రాతిపదికన స్పందించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం గట్టిగా ఆదేశించింది.





భారతదేశంలో జలాశయాల పరిస్థితిపై కేంద్రం మరో కీలక సమాచారాన్ని కూడా వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో 50 ఏళ్లు పైబడిన జలాశయాల సంఖ్య 1,681కి చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కట్టడాలు ఇప్పుడు కాలం చెల్లిన స్థితికి చేరుకుంటున్నాయని, వీటి నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి సూచించారు. కాలం చెల్లిన డ్యామ్‌ల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అవి ఆధునిక కాలంలో ఎదురయ్యే విపత్తులను తట్టుకోలేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మేడిగడ్డ విషయంలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు ఇప్పటికే కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జాగ్రత్తలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంత వేగంగా స్పందిస్తుందనే దానిపైనే ఈ బ్యారేజీ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాన్ని పటిష్టం చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

కేటగిరీ 1 కింద వర్గీకరించబడిన జలాశయాలంటే అవి ఎప్పుడైనా విఫలమయ్యే అవకాశం ఉన్న అధిక రిస్క్ కలిగినవిగా పరిగణించబడతాయి. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఇది కేవలం ఇంజనీరింగ్ లోపం మాత్రమే కాదని, వేల కోట్ల ప్రజా ధనం మరియు లక్షలాది మంది రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ హెచ్చరికలను హెచ్చరికలుగానే కాకుండా, మేల్కొలుపుగా భావించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. జలాశయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని కేంద్ర మంత్రి రాజ్ భూషణ్ చౌదరి పార్లమెంట్ సాక్షిగా పునరుద్ఘాటించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో ఇటువంటి బలహీనమైన నిర్మాణాలు కుప్పకూలితే ఊహించని నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చే మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించడం ప్రతి రాష్ట్రం ప్రాథమిక విధి అని గుర్తు చేశారు.

మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం మేడిగడ్డ పునరుద్ధరణ కోసం నిపుణుల కమిటీ సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే కేంద్రం తాజా నివేదికతో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన ఒత్తిడి పెరిగింది. వర్షాకాలం సమీపించేలోపు కనీసం ప్రాథమిక రక్షణ చర్యలైనా పూర్తి చేయకపోతే, రాబోయే సీజన్‌లో గోదావరి ప్రవాహాన్ని తట్టుకోవడం ఈ బ్యారేజీకి సవాలుగా మారవచ్చు. ఈ క్రమంలోనే కేంద్రం పంపిన ఈ గణాంకాలు రాష్ట్ర నీటిపారుదల శాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మొత్తానికి దేశవ్యాప్త జలాశయాల భద్రతపై కేంద్రం వెల్లడించిన ఈ వివరాలు డ్యామ్‌ల పటిష్టతపై కొత్త చర్చకు దారి తీశాయి. అభివృద్ధి పేరిట నిర్మించే భారీ ప్రాజెక్టుల నాణ్యత విషయంలో రాజీ పడితే ఫలితాలు ఎంత దారుణంగా ఉంటాయో మేడిగడ్డ ఉదంతం మనకు హెచ్చరిస్తోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించి, ఈ ప్రమాదకర జలాశయాలను ముప్పు నుంచి తప్పించి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దోషులు ఎవరో తేలాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**



అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు. కేసీఆర్‌ను ఒక ఉద్యమ నాయకుడిగా తాము గౌరవిస్తామని, అయితే చట్టం ముందు ఎవరూ అతీథులు కారని ఆయన స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత తీవ్రమైన నేరమని మహేష్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం క్షమించరాని విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో విచారణ అత్యంత పారదర్శకంగా సాగుతోందని, వాస్తవాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన వెల్లడించారు.

ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే తాను కూడా వాంగ్మూలం ఇచ్చినట్లు మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. తనతో పాటు చాలామంది ప్రముఖులు ఈ విషయంలో సాక్ష్యాలు ఇచ్చారని, ఆ క్రమంలోనే సిట్ అధికారులు కేటీఆర్, హరీష్‌రావులకు కూడా నోటీసులు జారీ చేశారని వివరించారు. ఈ వ్యవహారం జరిగిన సమయంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, అప్పటి పరిపాలనా వ్యవస్థలో ఆయన పాత్ర లేకుండా ఏమీ జరగదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి అనుమతి లేదా ఆదేశాలు లేకుండా అధికారులు ఇంతటి సాహసానికి ఒడిగట్టరని ఆయన వ్యాఖ్యానించారు. సిట్ విచారణ ద్వారా ప్రతి అంశం తేటతెల్లమవుతుందని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో ప్రజలు తెలుసుకోవాలని కోరుకుంటున్నారని, ఇందులో ఎవరిపై తమకు వ్యక్తిగత ద్వేషం లేదని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యగా దీనిని చూడకూడదని, తప్పు చేసిన వారు ఎవరైనా సరే చట్టానికి సమాధానం చెప్పాల్సిందేనని పీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. విచారణ సంస్థలు తమ పని తాము చేసుకుపోతున్నాయని ఆయన వివరించారు. గతంలో ప్రతిపక్ష నేతలు, పారిశ్రామికవేత్తలు, చివరికి సినీ నటీనటుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఆ విషయాలన్నీ బహిర్గతం కావాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాతే ఈ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేసి నిశితంగా విచారిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 500 మంది ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయని, ఈ కుట్ర వెనుక ఉన్న లోతైన వివరాలను సిట్ వెలికితీస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగం కేవలం పైస్థాయి ఒత్తిడి వల్లే ఇటువంటి పనులకు పూనుకుంటుందని కాంగ్రెస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి లేదా మంత్రుల ప్రమేయం లేకుండా అధికారులకు అంత ధైర్యం ఉండదని తాము భావిస్తున్నట్లు వెల్లడించారు. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ప్రకారమే అధికారులు నడుచుకున్నారని ప్రాథమికంగా అర్థమవుతోందని, అయితే విచారణ పూర్తి కాకుండా ఎవరినీ దోషులుగా నిర్ధారించలేమని మహేష్ కుమార్ గౌడ్ సంయమనంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. రెండున్నరేళ్ల తర్వాత కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని కొందరు రాజకీయ కక్షగా అభివర్ణించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో ఎక్కడా కక్ష సాధింపు ధోరణి లేదని, ఆధారాలు సేకరించిన తర్వాతే సిట్ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారని తెలిపారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ నేరాలు జరిగినప్పుడు చట్టపరమైన ప్రక్రియను ఎవరూ ఆపలేరని వారు స్పష్టం చేశారు. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకు సంకేతాలని వారు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల అంశాన్ని కూడా ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణతో పాటు రాజకీయంగా తాము బలంగా ఉన్నామని, రాబోయే ఎన్నికల్లో 75 నుండి 90 శాతం స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టికెట్ల పంపిణీ విషయంలో ఇంచార్జి మంత్రులు, డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ప్రజాక్షేత్రంలో గెలిచి తీరుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేసుపై ఎంపీ మల్లు రవి కూడా స్పందిస్తూ చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రికి నోటీసులు ఇవ్వడం అనేది పెద్ద వింతేమీ కాదని, చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే ఇదంతా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఎవరూ చట్టానికి అతీతులు కారని, సామాన్యుడికైనా, మాజీ ముఖ్యమంత్రికైనా నిబంధనలు ఒకేలా వర్తిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విచారణ వల్ల భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా అడ్డుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సిట్ నోటీసుల నేపథ్యంలో తదుపరి విచారణ ఎలా సాగుతుంది, కేసీఆర్ ఏ విధంగా స్పందిస్తారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కేసు పర్యవసానాలు రాబోయే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పీసీసీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు.

# దేశాభివృద్ధికి కలిసి రండి

**మొదటిపేజీ తరువాయి**

నిలబెట్టడమే తన ప్రభుత్వ పరమావధి అని ముఖ్యమంత్రి గంభీరంగా ప్రకటించారు. కేవలం సంప్రదాయ అభివృద్ధికి పరిమితం కాకుండా, ప్రపంచం గర్వించే రీతిలో రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరం ఇప్పటికే ఐటీ రంగంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, అయితే దానిని కేవలం ఐటీకే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లోనూ మేటిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో నగరాల రూపురేఖలు ఎలా ఉండాలో చూపేలా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ నగరం, తెలంగాణ అభివృద్ధికి ఒక నూతన చిరునామాగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. పర్యావరణ హితమైన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానిస్తున్నామని హార్వర్డ్ వేదికగా ఆయన ప్రకటించారు.

రాష్ట్ర ప్రగతిలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడం ద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగిస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. కేవలం పరిశ్రమల స్థాపనే కాకుండా, విద్య, వైద్య రంగాల్లో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు వివరించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి వచ్చే మేధోసంపత్తిని తెలంగాణ అభివృద్ధికి ఎలా మలుచుకోవాలనే అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానాన్ని స్వరాష్ట్ర పురోభివృద్ధికి ఉపయోగించాలని విద్యార్థులను కోరారు.

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఒక ముఖ్యమైన విజ్ఞప్తిని విద్యార్థుల ముందు ఉంచారు. హార్వర్డ్ వంటి సంస్థల్లో చదువుతున్న వారు కేవలం విద్యార్థులు మాత్రమే కాదని, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన మేధావులకు తెలంగాణలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి వివరించాలని కోరారు. రాష్ట్రం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సుపరిపాలన గురించి ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు.

ఈ పర్యటన ద్వారా తెలంగాణ గడ్డపై ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి సమర్థవంతంగా వివరించగలిగారు. పెట్టుబడిదారుల సమావేశాల్లో బిజీగా ఉన్నప్పటికీ, విద్యార్థుల కోసం సమయం కేటాయించడం ఆయనకు యువత పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఫలితంగా రానున్న రోజుల్లో తెలంగాణకు మరిన్ని విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ ద్వారా తెలంగాణ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి విజన్ పై అంతర్జాతీయ స్థాయిలో సానుకూలత ఏర్పడింది.

మొత్తానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హార్వర్డ్ సందర్శన తెలంగాణ రాజకీయాల్లోనూ, అభివృద్ధి పంథాలోనూ ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. విద్యార్థులతో ఆయన జరిపిన ఆత్మీయ సంభాషణలు, పంచుకున్న అనుభవాలు భావి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పడంలో సందేహం లేదు. తెలంగాణను విశ్వవేదికపై నిలబెట్టాలన్న ఆయన సంకల్పం ఈ పర్యటనతో మరింత బలపడింది. రాష్ట్ర భవిష్యత్తును వెలిగించే క్రతువులో ప్రవాస తెలంగాణ యువత కూడా భాగస్వాములు కావాలన్న పిలుపుతో ఈ చారిత్రాత్మక పర్యటన ముగిసింది.



## మంజీర కళాశాలలో వైభవంగా ఫుడ్ ఫెస్టివల్




**కామారెడ్డి, విశాలభారతి:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీర డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, దాదాపు 200 మంది విద్యార్థులు 350 కు పైగా వివిధ రకాల ఆహార పదార్థాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కేశిరెడ్డి గురువేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యాభ్యాసంలోనే కాకుండా, పౌష్టికాహార తయారీలోనూ ప్రతిభ చూపడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్స్ జావిద్, రవి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీలోకి భారీ చేరికలు



**రాజన్న సిరిసిల్ల , విశాలభారతి:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లపు లక్ష్మణ్ పట్టం శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రేడ్డబోయిన గోపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 6వ వార్డు నాంపల్లి బీజేపీ నాయకులు వానిక సంపత్, మెరుగు లక్ష్మణ్, గోల్లాం గంగరాజు, చిలివేరి బాబు, జడల నరసయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి లింగంపల్లి శంకర్ పాల్గొని బీజేపీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ముందు జరిగిన ఈ చేరికలు పార్టీకి బలాన్ని చేకూర్చనున్నాయని నాయకులు పేర్కొన్నారు.

## బోధన్ మున్సిపల్ ఎన్నికలు



**బోధన్ , విశాలభారతి:** బోధన్ పట్టణంలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ రెండో రోజూ ప్రశాంతంగా కొనసాగింది. పట్టణంలోని జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారుల (ROలు) కార్యాలయాల్లో వార్డు వారీగా అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రక్రియ సజావుగా సాగుతోంది. అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టగా, ఎన్నికల నియమావళి ప్రకారం అన్ని చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## గ్రామపంచాయతీలలో ప్రధాని చిత్రపటాల ఏర్పాటు చేయాలి : బిజెపి నాయకులు



**బీర్కూర్ , విశాలభారతి:** ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని భాజపా నాయకులు గురువారం బీర్కూర్ మండల ఎంపీడీవో శ్రీనిధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాజపా మండలాధ్యక్షుడు సాయికిరణ్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ సహకారం కీలకంగా ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాలు లేకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు, అభివృద్ధికి నాయకత్వం వహిస్తున్న ప్రధానిని గౌరవించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పీఎం మోదీ ఫొటోలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు శ్రీనివాస్, హన్మండ్లు, రాము, సాయిబాబా, మనోజ్, పండరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు



**4 ట్రాక్టర్ల సీజ్. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్ , విశాలభారతి:** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశానుసారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంతట్టి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు (4) ట్రాక్టర్లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న సదరు ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేసి, బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు డ్రైవర్లతో పాటు, ట్రాక్టర్ల యజమానులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

## సీఎం కప్ మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన సర్పంచ్ ధర్మతేజ



**బీర్కూర్ , విశాలభారతి:** బీర్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను గ్రామ సర్పంచ్ ధర్మతేజ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులతో సర్పంచ్ కరచలనం చేసి పరిచయం చేసుకొని వారి ఉత్సాహాన్ని అభినందించారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మతేజ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా సమానంగా అవసరమని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనశీలత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి మాట్లాడుతూ సీఎం కప్ క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని అన్నారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంఈఓ వెంకన్న, ఎంపీవో మహబూబ్, ఈవో గంగాధర్, శివకుమార్ యాదవ్, గాండ్ల సంతోష్, కూర్రి కృష్ణ, చామకూర రాజు, బాలరాజ్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ కుంభమేళాగా, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం మహా జాతర ఇప్పుడు పతాక స్థాయికి చేరుకుంది. అడవి బిడ్డల ఆరాధ్య దైవం, అన్యాయంపై ఎదిరించిన వీరమాత సమ్మక్క తల్లి ఆగమనం ఈ జాతరలోనే అత్యంత ఉత్కంఠభరితమైన, పవిత్రమైన ఘట్టం. చిలకలగుట్ట నుంచి కుంకుమ భరిణ రూపంలో వనదేవత సమ్మక్క గద్దెలపైకి తరలివస్తుండటంతో ములుగు జిల్లాలోని అడవి ప్రాంతమంతా ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయింది. "సమ్మక్క-సారలమ్మ మేలుకో" అన్న భక్తుల నినాదాలు నింగిని తాకుతుండగా, లక్షలాది మంది భక్తులు ఆ తల్లి రాక కోసం కనురెప్ప వేయకుండా వేచి చూస్తున్నారు. భక్తికి, ప్రకృతికి, పోరాటానికి ప్రతిరూపమైన ఈ జాతర తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటుతోంది. బుధవారం రాత్రి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెపై కొలువుదీరడంతో జాతరలో తొలి అంకం పూర్తయింది. గురువారం సాయంత్రం వేళ, వనం (చిలకలగుట్ట) వీడి సమ్మక్క తల్లి జనం వైపు అడుగులు వేయడం జాతరలో మలుపు తిరిగే ఘట్టం. ఈ సందర్భంగా పోలీసులు గౌరవవందనం సమర్పించగా, ఎస్పీ రాంనాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి స్వాగతం పలికారు. గిరిజన పూజారులు సాంప్రదాయబద్ధంగా తల్లిని గద్దెల వైపు తీసుకువస్తుండగా, భక్తుల జయజయధ్వానాలతో మేడారం పులకించిపోయింది. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు భక్తిశ్రద్ధలతో తల్లికి ఘనస్వాగతం పలికారు. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించడానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలు జనసముద్రాన్ని తలపిస్తున్నాయి.

- విశాలభారతి, స్టేట్ బ్యూరో





# గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క తల్లి

## మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరుగుతోంది

### సమ్మక్క తల్లి జనం వైపు అడుగులు వేసింది

**అడవి తల్లీ ఆశీస్సుల కోసం లక్షలాది మంది భక్తులు**

**పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి**

**జాతరలో తొలి అంకం విజయవంతంగా పూర్తయింది**

**ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు**

**తడి బట్టలతోనే గద్దెల వద్దకు చేరుకుంటున్నారు**





గిరిజన సంస్కృతికి అద్దం పట్టే మేడారం జాతరలో ప్రతీ ఘట్టం ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. గద్దెలపై దేవతలు కొలువుదీరడం చూసి భక్తులు పులకించిపోతున్నారు. ముడుపులు కట్టడం, కోళ్ల మొక్కులు చెల్లించడం వంటి ఆచారాలతో మేడారం కిటకిటలాడుతోంది. ముఖ్యంగా గిరిజన పూజారుల ఆధ్వర్యంలో జరిగే తంతును వీక్షించడానికి జనం ఎగబడుతున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ మహా జాతరలో శుక్రవారం నాడు సమ్మక్క రాకతో పతాక స్థాయికి చేరుకోనుంది. అడవి తల్లీ దీవెనలు అందరికీ కలగాలని కోరుకుంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలుతున్నారు. మేడారం అంటే కేవలం ఒక జాతర మాత్రమే కాదు, అదొక బలమైన సెంటిమెంట్. జాతర నిర్వహణలో సాంకేతికత వినియోగం కూడా ఈసారి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. భక్తులకు సమాచారం అందించడానికి ప్రభుత్వం మొబైల్ యాప్‌లను ప్రవేశపెట్టింది. వాహనాల పార్కింగ్ ఎక్కడ ఖాళీగా ఉందో తెలుసుకునే సౌకర్యం కల్పించారు. దీనివల్ల ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతున్నాయి. అలాగే జాతరలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారాలను చూపిస్తున్నారు. గద్దెల వద్ద రద్దీని తగ్గించేందుకు క్యూలైన్లను పటిష్టం చేశారు. సామాన్య భక్తుడు త్వరగా దర్శనం చేసుకునేలా ప్రాధాన్యత ఇస్తున్నారు. వనదేవతల జాతరలో పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్దపీట వేయడం అభినందనీయం.

పరిశుభ్రత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ జాతర ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మొబైల్ క్లినిక్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. భక్తులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మేడారం అడవి మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు వన్‌వే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. భారీ వాహనాలను జాతర ప్రాంతానికి దూరంగా నిలిపివేసి, భక్తులను చేరవేసేందుకు మినీ బస్సులను నడుపుతున్నారు. రాత్రి సమయంలో మేడారం వెలుగులీనుతోంది. విద్యుత్ దీపాల కాంతులతో అడవిలో ఒక చిన్న నగరం వెలసినట్లుగా దృశ్యం కనిపిస్తోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఎంతో ఉత్సాహంతో జాతరలో పాల్గొంటున్నారు. తల్లుల దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉన్నా, ఆ అలసట భక్తుల్లో కనిపించడం లేదు. సమ్మక్కసారలమ్మలపై ఉన్న అచంచలమైన నమ్మకమే వారిని ముందుకు నడిపిస్తోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ సంబరం కోసం భక్తులు వేయికళ్లతో ఎదురుచూస్తారు. ఈ ఏడాది మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

మేడారం జాతర నిర్వహణలో సేవా సంస్థల పాత్ర కూడా ఎంతో ప్రశంసనీయం. అనేక స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అన్నదానం, మంచినీటి సరఫరా చేస్తున్నాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తుల విశ్రాంతి కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఈ సేవా సంస్థలు కూడా కలిసి పనిచేయడం వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతోంది. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు కూడా వచ్చే భక్తులకు తమ వంతు సహాయం అందిస్తూ ఆతిథ్యం ఇస్తున్నారు. జాతరలో మరో ఆకర్షణ ఆదివాసీల నృత్యాలు, ఇవి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొమ్ము నృత్యం, థింసా వంటి ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. తమ సంస్కృతిని కాపాడుకుంటూనే, ప్రపంచానికి తమ విశిష్టతను చాటుతున్నారు గిరిజనులు. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు కూడా ఈ వినూత్న వేడుకను చూసి ఆశ్చర్యపోతున్నారు. మేడారం జాతర ప్రాశస్త్యం రోజురోజుకూ పెరుగుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఇది తెలంగాణ గర్వించదగ్గ జానపద జాతరగా నిలిచింది. ముగింపు దశకు చేరుకుంటున్న కొద్దీ మేడారంలో ఉత్కంఠ పెరుగుతోంది. రాబోయే రెండు రోజులు అత్యంత కీలకమైనవిగా అధికారులు భావిస్తున్నారు.

గద్దెలపై తల్లులు కొలువై ఉన్న సమయంలో దర్శనం చేసుకోవడం అత్యంత పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. అందుకే శుక్ర, శనివారాల్లో జనప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకు తగినట్లుగా అదనపు బలగాలను రంగంలోకి దింపారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పటిష్టమైన నిఘా కొనసాగిస్తున్నారు. సారలమ్మ రాకతో మేడారం పులకించిపోయింది. అడవిబిడ్డల పోరాట పటిమకు, త్యాగానికి చిహ్నమైన ఈ జాతర విజయవంతంగా సాగుతోంది. గద్దెలపై వనదేవతల దర్శనం చేసుకున్న భక్తులు పునీతులవుతున్నారు. ప్రభుత్వం, అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సేవకుల కృషి ఫలితంగా మేడారం జాతర మునుపెన్నడూ లేని విధంగా వైభవంగా జరుగుతోంది. భక్తులందరూ సురక్షితంగా తల్లులను దర్శించుకుని తమ ఇళ్లకు చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు. మేడారం జాతర చారిత్రక నేపథ్యం భక్తుల్లో ఒక రకమైన వీరత్వాన్ని నింపుతుంది. అన్యాయంపై పోరాడిన తల్లి కూతుళ్ల కథ అందరికీ స్ఫూర్తిదాయకం. అందుకే ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా వేడుక కోసం కోట్లాది మంది వేచి చూస్తారు. ఈ ఏడాది కూడా మేడారం తన విశిష్టతను చాటుకుంటూ భక్తజన హృదయాల్లో నిలిచిపోతోంది.

నేటితో జాతరలో ప్రధాన ఘట్టం ఆరంభమైంది. సమ్మక్క రాకతో జాతర సంపూర్ణమవుతుంది. గద్దెలపై దేవతలంతా కొలువుదీరిన వేళ మేడారం స్వర్గాన్ని తలపిస్తుంది. అడవిలో వెలిసిన ఈ ఆధ్యాత్మిక వేడుక ప్రతి ఒక్కరికీ మరపురాని అనుభూతిని మిగిలిస్తోంది. భక్తి, విశ్వాసం, సంప్రదాయాల మేళవింపుగా మేడారం మహాజాతర దిగ్విజయంగా సాగుతూ తెలుగు నేల గర్వపడేలా చేస్తోంది. ఆదివాసీల ఆచారాలు, ఆధునిక సౌకర్యాల కలయికతో ఈసారి జాతర సరికొత్త వైభవాన్ని సంతరించుకుంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, వనదేవతల దీవెనలు పొంది భక్తులు తమ జన్మ ధన్యమైందని భావిస్తున్నారు. ముగింపు దశలో వనదేవతలు తిరిగి వనప్రవేశం చేసే ఘట్టం కూడా ఎంతో ఉద్వేగభరితంగా ఉంటుంది. తల్లి వెళ్లినప్పుడు భక్తులు కన్నీటి వీడ్కోలు పలుకుతారు. మళ్లీ రెండేళ్ల తర్వాత కలుద్దామన్న ఆశతో వెనుదిరుగుతారు. ఈ జాతర కేవలం భక్తి మార్గమే కాదు, ఒక సామాజిక ఐక్యతకు వేదిక. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి అమ్మవార్లను కొలుచుకుంటారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి భారీగా నిధులు వెచ్చించడం వల్ల సౌకర్యాలు మెరుగుపడ్డాయి. జాతర ముగిసే వరకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి.

మేడారానికి వచ్చే మార్గాలన్నీ ఇప్పుడు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు రికార్డు స్థాయి సమర్థతను ప్రదర్శిస్తున్నారు. డ్రోన్ల సాయంతో రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దారి మళ్లిస్తున్నారు. తాగునీటి ఎద్దడి కలగకుండా యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లు ఏర్పాటు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా ఉంచడం వల్ల ఇంత భారీ జనసందోహం ఉన్నా మేడారం పరిశుభ్రంగా కనిపిస్తోంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో ఈ జాతర ఒక మైలురాయిగా నిలుస్తోంది. అటవీ సంపదను కాపాడుకుంటూనే జాతరను నిర్వహించడం ఒక సవాలుగా ఉన్నా, యంత్రాంగం దాన్ని సమర్థంగా ఎదుర్కొంటోంది. సమ్మక్క సారలమ్మల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ మహా క్రతువు కొనసాగుతోంది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా సమ్మక్క కీర్తించబడుతోంది. ములుగు జిల్లా అడవుల నుంచి వెలువడుతున్న ఆధ్యాత్మిక తరంగాలు రాష్ట్రమంతటా వ్యాపిస్తున్నాయి. ఆదివాసీల పోరాట పటిమ, వారి సంస్కృతి, సంప్రదాయాలు ఈ జాతర ద్వారా భావితరాలకు అందుతున్నాయి. రేపటి వరకు గద్దెలపై అమ్మవార్ల దర్శనం కొనసాగుతుంది, ఆపై తల్లులు తిరిగి తమ వనవాసానికి వెళ్తారు. ఈ లోపు ఆ దివ్య దర్శనం కోసం భక్తులు మేడారానికి ప్రవాహంలా తరలివస్తూనే ఉన్నారు.

మేడారం జాతర కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు, అది ఒక చారిత్రక వారసత్వం. కాకతీయ చక్రవర్తుల కాలంలో అన్యాయమైన పన్నులకు వ్యతిరేకంగా, గిరిజన హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన సమ్మక్క-సారలమ్మల వీరగాథ నేటికీ స్ఫూర్తినిస్తోంది. అందుకే ఈ జాతరలో ఎటువంటి విగ్రహాలు ఉండవు, కేవలం గద్దెలపై కుంకుమ భరిణలనే దేవతలుగా పూజిస్తారు. ప్రకృతితో మమేకమైన గిరిజన సంస్కృతి ఇక్కడ ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది. లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఆహ్వానం లేకుండానే, తమ మొక్కులు చెల్లించుకోవడానికి అడవి మార్గాల గుండా పయనించి ఇక్కడికి చేరుకోవడం విశేషం. జాతర ప్రారంభమైన తొలి రోజే భక్తజనం మేడారానికి పోటెత్తారు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేల సంఖ్యలోని బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో భక్తులు చేరుకుంటున్నారు. దీంతో జంపన్నవాగు పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు ముందుగా పవిత్ర జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, తడి బట్టలతోనే గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటూ అమ్మవార్లకు నిలువెత్తు 'బంగారం' అంటే బెల్లాన్ని సమర్పిస్తున్నారు. ఈ బంగారం సమర్పణ అనేది ఈ జాతరలో అత్యంత కీలకమైన ఆచారం.

ఈ మహా జాతరలో రాజకీయ ప్రముఖుల తాకిడి కూడా పెరిగింది. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు మేడారానికి విచ్చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే మేడారంలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయ నాయకుల రాకతో మేడారంలో మరింత సందడి నెలకొంది. వీఐపీల దర్శనాల వల్ల సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతర ఏర్పాట్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. మేడారం జాతర భద్రత కోసం ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ యంత్రాంగాన్ని మోహరించింది. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో సుమారు 40 వేల మంది సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. 42 హెక్టార్ల విస్తీర్ణంలో 21 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా జాతర ప్రాంగణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. తప్పిపోయిన వారిని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడానికి ప్రత్యేకంగా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. జంపన్నవాగు వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.







DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# కురవిలో సీఎం కప్ మండల స్థాయి సెలక్షన్స్

- జనవరి 30, 31 తేదీలలో జడ్పీహెచ్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహణ



**కురవి, విశాలభారతి:** కురవి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల జనవరి 30, 31 తేదీలలో సీఎం కప్ మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కురవి మండల ఎంపీడీవో అధికారి వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ సెలక్షన్స్‌లో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడా ప్రతిభను ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఫారం మరియు ఆధార్ కార్డు తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ సెలక్షన్స్ ద్వారా ఎంపికైన క్రీడాకారులు తదుపరి దశ పోటీలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఎంపీడీవో వీరబాబు తెలిపారు.

# పురపోరు.. హోరాహోరి నామినేషన్లు

- రెండో రోజు కొనసాగిన నామినేషన్లు



**మొయినాబాద్, విశాలభారతి:** పురపోరు ఎన్నికల నామినేషన్ల స్వీకరణ రెండో రోజు హోరాహోరీ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఎమ్మార్సీహెచ్ పాఠశాలలోని నామినేషన్ కేంద్రంలో మొయినాబాద్ మున్సిపాలిటీలోని 26 కౌన్సిలర్ పదవులకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం భారీ జన సందోహంతో వివిధ వార్డుల నుంచి అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లు వేశారు. గురువారం రెండో రోజు కౌన్సిలర్ పదవులకు సంబంధించిన మొత్తం 77 మంది అభ్యర్థులు నామినేషన్లు దరఖాస్తు అయినట్లు మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక సీఐ పవన్ కుమార్ రెడ్డి పోలీసుల సహకారంతో తమ సిబ్బందితో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టుతున్నామని తెలిపారు.

# మహబూబాబాద్ జిల్లాకు లోకల్ హాలిడే



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా జనవరి 30వ తేదీ (శుక్రవారం) లోకల్ హాలిడేగా ప్రకటించారు. సమ్మక్క -సారలమ్మ మేడారం మహాజాతర ములుగు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో, భక్తులకు సౌలభ్యం కల్పించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ లోకల్ హాలిడే కారణంగా మహబూబాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థలు జనవరి 30న మూసి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. మేడారం జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో, జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వం ఈ సెలవును ప్రకటించినట్లు తెలిపారు. జాతర సందర్భంగా శాంతిభద్రతలు, రవాణా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ జాతరను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మార్సీహెచ్ పాఠశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ పరిశీలించారు. గురువారం నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాటులో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అనుసరిస్తున్న విధానాలను మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ను జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి నామినేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టాలని, అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు.

# మున్సిపాలిటీ 6వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా భూక్య బుజ్జి రాంజీ నామినేషన్



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా భూక్య బుజ్జి రాంజీ తొలి సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉత్సాహభరిత నినాదాల మధ్య విజయ సంకల్ప ర్యాలీ నిర్వహిస్తూ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ర్యాలీ సందర్భంగా పార్టీ శ్రేణులు బుజ్జి రాంజీకి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నామినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా, ఉత్సవ వాతావరణంలో సాగింది.

# రోడ్ల రూపురేఖలు మారుతున్నవి



**కేశంపేట, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల రూపురేఖలు మారుతున్నవని కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు బీస కరుణాకర్ రెడ్డి అన్నారు. మండలపరిధిలోని కాకునూరు గ్రామం నుండి తొమ్మిది రేకుల గ్రామం వరకు ఐదు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ గోపాల్ రెడ్డి తో కలిసి కరుణాకర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ వచ్చిందని,కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారుల కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుండటంతో రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు.రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సహకరించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేష్ కు కరుణాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భోధునం పల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, మంగళి గూడ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి, నాయకులు విజయ రెడ్డి, పర్వతాలు, హరీశ్వర్ రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలకు మున్సిపల్ ఎన్నికలే సమాధానం

- సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్, విశాలభారతి:** అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ హోం శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్ హాల్‌లో మండల మున్సిపల్ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభ్యర్థులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ జై సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను సమపాళ్లలో ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని తీవ్ర విమర్శలు చేశారు. అబద్ధాల పునాదులపై అధికారం ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. మున్సిపల్ పరిధిలో ఏ వార్డుకెళ్లినా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు కేసీఆర్ మాటను, ఆయన చేసిన అభివృద్ధిని మరచిపోలేదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను మొయినాబాద్ మున్సిపాలిటీలో ఎగరవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పార్టీ అధిష్టానం చేస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఏమీ చేయలేదన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారని, అందరూ ప్రజలతో మమేకమై గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవి యాదవ్, మండల మున్సిపల్ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి, నాయకులు నరోత్తం రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఫార్మర్ రిజిస్ట్రీ' ఉంటేనే ప్రభుత్వ పథకాలు

- నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారుల విజ్ఞప్తి



**మర్పల్లి, విశాలభారతి:** రైతులందరికీ ఫార్మర్ రిజిస్ట్రీ' ప్రామాణికంగా మారనున్నట్లు మండలంలోని రైతులందరూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ' (రైతు నమోదు) ప్రక్రియను తక్షణమే పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పెట్టుబడి సాయం, బీమా, మరియు ఇతర సబ్సిడీ పథకాలు అందాలంటే ఈ డిజిటల్ గుర్తింపు తప్పనిసరని వారు స్పష్టం చేశారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పి.ఎం. కిసాన్ వంటి పథకాల లబ్ధిని కేవలం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే అందించాలని నిర్ణయించింది. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, పంటల బీమా, మరియు వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు కూడా ఈ ఫార్మర్ ఐడీ ప్రామాణికంగా మారనుంది. రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం కింది పత్రాలు అవసరం పడుతాయన్నారు. 1.పట్టాదారు పాస్ పుస్తకం, 2.ఆధార్ కార్డు (మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలి),3.బ్యాంక్ ఖాతా పుస్తకం (ఆధార్ సీడింగ్ పూర్తి కావాలి). 4.ఫోన్ నెంబర్ (ఓటీపీ ధృవీకరణ కోసం). మర్పల్లి మండలంలో అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నమోదులో ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక ఏఈఓలను సంప్రదించాల నీ సూచించారు.

# సింగరేణి ఈపీ ఆపరేటర్ల ఆకస్మిక ధర్నా

- సింగరేణి ఈపీ ఆపరేటర్ల ఆకస్మిక ధర్నా
- 4 కిలోమీటర్లు నడక చేసిన ఆపరేటర్లు
- దుమ్ము, దూళిలో భోజనం చేయలేమని ఆందోళన



**ఖమ్మం, విశాలభారతి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని జే.వి.ఆర్ ఓసి ఇంటర్నల్ పార్కింగ్ లో ఏర్పాటుచేసిన రెస్ట్ రూమ్ లో బుధవారం రోజు దుమ్ము ధూళి భోజనం లో కలుస్తున్నాయని తినకుండా సర్ఫేస్ పార్కింగ్ లోని క్యాంటీన్ వద్దకు నాలుగు కిలోమీటర్లు నడిచిన ఈపీ ఆపరేటర్లు... తమకు క్యాంటీన్ లోనే భోజనాలు ఏర్పాటు చేయాలని ఆందోళన . లోగడ సర్ఫేస్ పార్కింగ్ పైనే ఉండటంతో ఆపరేటర్లు డంపర్లు వేసుకొని వచ్చి భోజనాలు చేస్తుండటంతో నాలుగున్నర కోట్ల రూపాయలు డీజిల్ ఖర్చు అవుతుందని భావించి ఇంటర్నల్ పార్కింగ్ ఏర్పాటు చేయించి కోల్ యార్డ్ వే బ్రిడ్జిని ఆపరేటర్ల కోసం రెస్ట్ హాల్ గా మార్చింది ..ఇంటర్నల్ పార్కింగ్ వద్ద డంపర్లను ఉంచి మూడు నెలల పాటు ఆపరేటర్లను బస్సులో మెస్ వద్దకు తీసుకువచ్చి భోజనం చేయించేవారు మేనేజ్మెంట్ వారు.. ఈ రోజు బస్సుని పంపకుండా భోజనాలు రెస్ట్ హాల్లోనే చేయాలని చెప్పడంతో ఈపీ ఆపరేటర్లు నిరాకరించారు... కోల్ యాడ్,పార్కింగ్ యార్డ్ సమంతా బెల్ట్ ,క్రషర్ లు రెస్ట్ హాల్ చుట్టూ ఉండటంతో దుమ్ము ధూళి వస్తుండటంతో తినే ఆహారమైన మంచిగా తినాలని ఈపీ ఆపరేటర్లు 4 కిలోమీటర్లు నడుచుకుంటూ సర్ఫేస్ పార్కింగ్ వద్ద గల క్యాంటీన్ కు వచ్చి ఆందోళనకు దిగారు. యాజమాన్యం పై నుండి ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే తాము చేస్తున్నామని రెస్ట్ హాల్లోనే భోజనాలు చేయాలని సూచించడంతో రెండో షిఫ్ట్ కి విధులను బహిష్కరించారు ఈపీ ఆపరేటర్లు తమకు హక్కు అయిన క్యాంటీన్ లోనే భోజనాలు చేస్తామని ఆ విధంగానే ఏర్పాటు చేసే వరకు పోరాడతామని సింగరేణి గేటు ముందు ధర్నా చేశారు. ఆపరేటర్లలో బిపి, షుగర్ ఉన్నవారు ఉన్నారు. బస్ లేకపోయినా మానవత్వంతో నైనా ఉన్న 8 బొలెరో లలో నైనా పైకి తీసుకు రాలేదని అన్ని సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యంపై మండిపడ్డారు. తాము కూడా సింగరేణికి ఆదాయాన్ని కల్పించేందుకే చూస్తున్నామని ఇప్పటికైనా యాజమాన్యం మొండివైఖరిని వదిలి కార్మికుల ఆరోగ్యాలను కాపాడేలా క్యాంటీన్లోనే భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. సత్తుపల్లి సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, ఈపీ ఆపరేటర్లు.

# భక్తులకు అన్నదానం కార్యక్రమం భేష్




- ఏరియా జీఎం దుర్గం రాంచందర్

**మణుగూరు, విశాలభారతి:** మినీ మేడారం జాతరలో తోగ్గుడెం గ్రామం వద్ద మణుగూరు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం భేష్ అంటూ ఏరియా జీఎం దుర్గం రామ్ చందర్ అన్నారు. గురువారం మినీ మేడారం వద్ద జరిగిన రెండో రోజు అన్నదాన కార్యక్రమానికి అతిథిగా హాజరైన జిఎం దుర్గం రాంచందర్ రిబ్బన్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటెశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దారా రమేష్, పెండ్యాల విజయ భాస్కర్ లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు 14 సంవత్సరాలుగా 7వ సారి వరుసగా భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. అన్నదానం చేయడం పట్ల వాసవీ క్లబ్, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్, పినపాక నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం, మండల పట్టణ ప్రతినిధుల సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సింగరేణి సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మణుగూరు అశ్వాపురం మండల తాసిల్దార్లను, అశ్వాపురం సిఐ లను అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మణుగూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, ట్రెజరర్ సూర్యం, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కడవెండి విశ్వనాథ గుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, ఎలుగూరి నగేష్, పల్లెర్ల చంద్రశేఖర్, దారా నీరజ్, నరేంద్రుల హేమంత్, జల్ది శ్యామ్, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డకుల రాజేశ్వరరావు, దారా మల్లికార్జున రావు, ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి రాము, శివకామేశ్వరి గ్రూప్ డైరెక్టర్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ దోసపాటి నాగేశ్వరరావు, రోజా రాణి, పిచ్చేశ్వరరావు, వాసవీక్లబ్, ఆర్యవైశ్య ప్రతినిధులు బండారు నర్సింహారావు, ధర్మారావు, చిత్తలూరి రమేశ్, మోహన్ రావు, అశ్వాపురం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు స్వరాజ్యరావు, రేపాక వెంకన్న, కోటగిరి సందీప్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# అసత్య ప్రసారాలను మానుకోవాలి

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి
- మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు




**మునగాల, విశాలభారతి:** ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్ దంపతులు నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి, మునగాల మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిజాయితీతో నిబద్ధతో పరిపాలన చేస్తున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి లపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అసత్య ప్రచారాలు మానుకోవాలని వారు ఖండించారు. కోదాడ నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఎత్తిపోతల పథకాలకు రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ వైద్యశాల, ఆర్టీసీ బస్టాండ్ ఇలాంటివి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి వాళ్ల కళ్ళకు కనబడుతున్న ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక వారు చేస్తున్న ఆరోపణలు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మునిసిపల్ ఎన్నికల కోసమే ఆరాటపడుతున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు స్కాం జరిగింది నిజం కాద అని త్రీవస్థాయిలో ధ్వజంమెత్తారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటయ్య, మునగాల గ్రామశాఖ అధ్యక్షులు కొమ్ము ఈధారావు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కాలే సామెలు, మాజీ సర్పంచ్ బీమపంగు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, విశాలభారతి:** మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డి. హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల పాత్ర కీలకమని తెలిపారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై నిరంతర నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి తనిఖీని వీడియో రికార్డు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు.శిక్షణ అనంతరం ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల కోసం కేటాయించిన వాహనాలను కలెక్టర్, సాధారణ పరిశీలకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌కు బాటసింగారం విద్యార్థులు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** జడ్.పి.హెచ్.ఎస్ బాటసింగారం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈనెల 29, 30 తేదీలలో హన్మకొండలోని జవహర్ లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ట్రైబ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తులసి రామ్ 400 మీటర్ల పరుగు పందెంలో, దత్తు వెయిట్ లిఫ్టింగ్ 60 కేజీల విభాగంలో, అంజి 100 మీటర్ల పరుగు పందెంలో, శ్రీరామ్ లాంగ్ జంప్ విభాగంలో పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు.ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే, ఖేలో ఇండియా - గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహించే జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న రెండో దశ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశముందని పేర్కొన్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, ఉప సర్పంచ్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రపంచ సాంకేతిక విద్యను మహిళలు అందిపుచ్చుకోవాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా. వి. బాలకిష్టారెడ్డి




**ముషీరాబాద్, విశాలభారతి:** ప్రపంచ సాంకేతిక విద్యను మహిళలు అందుపుచ్చుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ వి బాలకృష్ణారెడ్డి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాటజీస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్మెంట్ ఇన్ ఇండియా అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశం కళాశాల ప్రిన్సిపల్ డా. కె.ప్రభు అధ్యక్షతన గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా.వి. బాలకిష్టారెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలు ఆర్థిక రంగాల్లో సాధికారతను సాధించాలని నాణ్యమైన విద్యను అభ్యసించాలని కోరారు. మహిళలకు నైపుణ్య విద్యారంగాన్ని ప్రోత్సహించాలని రాజకీయ రంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. మహిళల హక్కులను గౌరవించి అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించినప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రభు, రిటైర్డ్ ప్రొఫెసర్ నాయుడు అశోక్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ రమాదేవి, ఆర్ లావణ్య, తిరుపతి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'స్పర్శ్' కుష్ఠు అవగాహన కార్యక్రమం నిర్వహణ



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆదేశాల మేరకు లెప్రసీ-ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 'స్పర్శ్' కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశంలో కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే 'స్పర్శ్' కార్యక్రమం జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు దేశవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, అలాగే కుష్ఠు రోగుల పట్ల ఉన్న అపోహలు, వివక్షను పూర్తిగా తొలగించడమేనని పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధి అయినప్పటికీ సమాజంలో ఇప్పటికీ అనేక అపోహలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్పర్శ్ కార్యక్రమం ద్వారా పాఠశాలలు, గ్రామాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుష్ఠు వ్యాధి లక్షణాలైన చర్మంపై తెల్లటి మచ్చలు, స్పర్శాభావం, చేతులు లేదా కాళ్లలో మొద్దుబారటం, నరాల బలహీనత వంటి లక్షణాలను క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య సిబ్బంది ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి ఉచిత పరీక్షలు, చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. కుష్ఠు వ్యాధి వంశపారంపర్య వ్యాధి కాదని, చికిత్స లేకుండా ఉన్న రోగులతో దీర్ఘకాల సన్నిహిత సంబంధం వల్ల మాత్రమే వ్యాప్తి చెందుతుందని స్పష్టం చేశారు. చికిత్స పొందుతున్న రోగుల నుంచి వ్యాధి వ్యాప్తి చెందదని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో యాక్టివ్ కేస్ డిటెక్షన్ నిర్వహిస్తూ, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. ముందస్తు చికిత్స ద్వారా వికలాంగతను నివారించడంతో పాటు కుష్ఠు రోగులు గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్‌తో అవగాహన ఒప్పందం



**హైదరాబాద్, విశాలభారతి:** హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యానికి తన నిబద్ధతను మరింత బలపరుస్తూ, అత్యాధునిక కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ పరిశోధనా ప్రయోగశాల స్థాపన కోసం లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ను 29 జనవరి 2026న అధికారికంగా సంతకం చేయడం జరిగింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఎఐ & ఎమ్ఎల్ పరిశోధనా ప్రయోగశాల ఏర్పాటుకు నిధులను మంజూరు చేసింది. దీని ప్రధాన లక్ష్యం కృత్రిమ మేధస్సు రంగంలో విద్యార్థుల పరిశోధనా నైపుణ్యాలు మరియు ప్రాయోగిక సామర్థ్యాలను పెంపొందించడం. ఈ ప్రయోగశాలలో లాయిడ్స్ అందించే వాస్తవ పరిశ్రమ సమస్యలపై దృష్టి సారించి, విద్యార్థులు, అధ్యాపకులు అత్యాధునిక, రియల్‌టైమ్ ప్రాజెక్టులపై పనిచేయనున్నారు. లాయిడ్స్ టెక్నాలజీ ప్రతినిధి బృందానికి డా. విపుల్ సింగ్ నాయకత్వం వహించగా, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన జెనీ, రవి మరియు డా. పూనమ్ సింగ్ ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, పరిశ్రమకు సంబంధించిన ప్రాజెక్టుల ద్వారా యువ ప్రతిభను ప్రోత్సహించడంపై లాయిడ్స్ నిబద్ధతను తెలియజేశారు. దీని ద్వారా అకాడమిక్ అధ్యయనం, పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించవచ్చని వారు పేర్కొన్నారు. ఎఐ అండ్ ఎమ్ఎల్ పరిశోధనా ప్రయోగశాలకి కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. డి. ఎల్. శ్రీనివాస రెడ్డి ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరించనున్నారు. డా. సి. వి. నరసింహులు మరియు డా. కె. రమణ సహ-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లుగా ఉంటారు. ఈ కార్యక్రమంలో ఎఐ & డి ఎస్ విభాగాధిపతి డా. కె. రాధిక, ప్రిన్సిపాల్ డా. సి. వి. నరసింహులు, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ తనిఖీలు

- **హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వాహనాలపై 15 కేసులు**
- **పత్రాలు లేని పాఠశాల ఆటోల సీజ్**



**మహబూబాబాద్, విశాలభారతి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలో గురువారం ట్రాఫిక్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై 15 కేసులు నమోదు చేశారు. అదే విధంగా సరైన అనుమతులు, పత్రాలు లేకుండా పాఠశాల పిల్లలను తరలిస్తున్న ఆటోలపై 4 కేసులు నమోదు చేసి ఆయా ఆటోలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సరైన పత్రాలు కలిగి ఉండడం ఎంతో కీలకమని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సాయి చరణ్, వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఫుట్పాత్ పై పెట్టిన భారీ బడ్డీని తొలగించాలి

- **ప్రభుత్వ భూమి ఫుట్ పాత్ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి**
- **సులబ్ కాంప్లెక్స్ పార్కింగ్ ప్లేస్ కబ్జాను అధికారులు కాపాడాలి**
- **బడ్డీ తొలగించే వరకు దళిత ప్రజా సంఘాల దశల వారి పోరాటం నిర్వహిస్తాం**



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణంలోని సులబ్ కాంప్లెక్స్ ప్రక్కన ఉన్న ఫుట్ పాత్ పార్కింగ్ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి భారీ బడ్డీని ఏర్పాటు చేయటం సరైంది కాదని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడిపట్రాజ్, మహాజన సమితి అధ్యక్షులు గడ్డం సుధాకర్ రావు, ఎమ్మార్పీఎస్ మాజీ నాయకులు తోకల దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఫుట్పాత్ను ఆక్రమించి భారీ బడ్డీని ఏర్పాటుచేసిన బడ్డీ వద్ద నిరసన వ్యక్తం చేశారు తక్షణమే అధికారులు ఈ బడ్డీని తొలగించి పార్కింగ్ ప్లేస్ ను కాపాడాలని వారు అన్నారు. ఇప్పటికే భద్రాచలం పట్టణంలో ఫుట్పాత్తులు ఆక్రమణకు గురవుతున్నాయని రాత్రికి రాత్రే భారీ బడ్డీ ఏర్పాటు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమిస్తున్నారని ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత సంబంధిత అధికారుల మీద ఉందని ఈ భారీ బడ్డీని తొలగించే దాంట్లో అధికారులు చొరవ చూపాలని తక్షణమే ఈ భారీ బడ్డీని తొలగించి ప్రభుత్వ ఫుట్పాత్ స్థలాలను కాపాడాలని వారు పేర్కొన్నారు. ఈ భారీ బడ్డీని తక్షణమే అధికారులు తొలగించకపోతే దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. గతంలో బీఈడీ కాలేజీ ఎదురుగా ఉన్న అలాగే నన్నపనేని స్కూల్ ఎదురుగా ఉన్న అలాగే డిగ్రీ కాలేజ్ ప్రక్కన ఉన్న కొన్ని బడ్డీలను తోపుడుబండ్ల వ్యాపారస్తులను నిర్దాక్షణంగా తొలగించారని ఇందులో రోజువారి కూలి చేసుకుంటూ పొట్ట పోసుకునే చిన్న వ్యాపారస్తులే తొలగించే దాంట్లో అన్యాయానికి గురి అయ్యారని వారు ఆవేదన చెందారు. చిన్నాచితక వ్యాపారస్తుల బడ్డీలను తోపుడు బండ్లను తొలగించిన అధికారులు భారీ బడ్డీలను ఎందుకు తొలగించట్లేదు ప్రజలకి చెప్పాలని వారు అన్నారు. చిన్న వాళ్ళకి ఒక చట్టం పెద్దోళ్ళకి మరొక చట్టమా అని వాళ్ళు ప్రశ్నించారు. ఇప్పటికైనా భారీగా ఏర్పాటు చేస్తున్న బడ్డీలను తొలగించి ప్రభుత్వ స్థలాలైన ఫుట్పాతులను కాపాడి పార్కింగ్ ఇబ్బందులను లేకుండా చేయాలని వారు డిమాండ్ చేశారు.

# దళితుల స్థలంపై పంచాయతీ దౌర్జన్యం

- **అంబేద్కర్ బహుజన సమాజ సేవా సంఘం ఫిర్యాదు**



**మర్పల్లి, విశాలభారతి:** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం గుండ్లమర్పల్లి గ్రామంలో దళితులకు చెందిన స్థలంలో బలవంతంగా పంచాయతీ కార్యాలయ నిర్మాణం చేపట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అంబెద్కర్ బహుజన సమాజ సేవా సంఘానికి కేటాయించిన స్థలంలో సర్పంచ్ వర్గీయులు దౌర్జన్యంగా నిర్మాణ పనులు ప్రారంభించారని సంఘం నాయకులు ఆరోపించారు. గ్రామంలోని హనుమాన్ మందిరం సమీపంలో ఉన్న సుమారు 20 గుంటల స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా దళితులు పెంట స్థలంగా ఉపయోగించుకుంటూ వచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కారణాలతో పెంటలు వేయవద్దని సూచించడంతో గ్రామస్తులంతా ఆపేశారని, ఇతర కులాల వారు తమ పెంట స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ దళితులు మాత్రం అట్టి స్థలాన్ని అలాగే ఉంచుకొని గత సర్పంచ్ సహకారంతో చదును చేయించుకున్నారని వివరించారు. ఈ స్థలాన్ని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అంబెద్కర్ ఆశయాలతో బహుజన సమాజ సేవా సంఘాన్ని రిజిస్టర్ చేసి, డబ్బు లేని గ్రామస్తులు పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించుకునేలా వినియోగిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లుగా అంబెడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఇక్కడే జరుగుతున్నాయని, గ్రామానికి అందరికీ తెలిసిన విషయమేనని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నూతన సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ముందుగానే తెలియజేసి రిజిస్ట్రేషన్ కాపీలు అందజేశామని, భవిష్యత్తులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోరితే వారు అంగీకరించినట్లు తెలిపారు. అయితే బుధవారం (28012026) ఉపసర్పంచ్ తమ్ముడు మంగలి ఈశ్వర్, సర్పంచ్ భర్త పురుషోత్తం, గ్రామ కార్యదర్శి వాణి కలిసి రాజకీయ కక్షతో గ్రామస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ పేరిట పోలీసులు, జేసీబీలను తెప్పించి పరదాలు కట్టి దౌర్జన్యంగా పనులు ప్రారంభించారని ఆరోపించారు. ప్రశ్నించిన గ్రామస్థులను "ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ బెదిరించారని, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి గ్రామ కార్యదర్శి వెళ్లిపోయిందని తెలిపారు.

## మర్పల్లిలో 'డిప్యూటేషన్'ల పర్వం

- **విధులకు తూట్లు.. ప్రజలకు తిప్పలు!**




**మర్పల్లి విశాలభారతి :** మండలంలో డిప్యూటేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పలుకుబడితో లేదా ఉన్నతాధికారుల అండదండలతో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తమ అసలు విధులను విస్మరించి, అనుకూలమైన చోట 'డ్యూటీ' చేసేందుకు మక్కువ చూపుతున్నారు. దీనివల్ల మండలంలోని కీలక శాఖలు కుంటుపడుతుండగా, సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మండలంలోని మారుమూల గ్రామాల్లో విధులు నిర్వహించాల్సిన క్షేత్రస్థాయి సిబ్బంది, డిప్యూటేషన్ల పేరుతో మండల కేంద్రంలోనో లేదా తమకు నచ్చిన పట్టణ ప్రాంతాల్లోనో తిష్ట వేస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్ ,విద్యా, వైద్య, రెవెన్యూ వంటి కీలక శాఖల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల నుంచి కూడా కొందరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్లపై కార్యాలయాల్లో పనిచేసేందుకు వెళ్లడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సిన సిబ్బంది లేకపోవడంతో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది దీంతో కీలకమైన ఫైళ్లు కదలకపోవడంతో రైతులు, సామాన్యులు పనుల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. నిజానికి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డిప్యూటేషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, మర్పల్లి మండలంలో మాత్రం 'సౌకర్యం' కోసమే వీటిని వాడుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేయడం ఇష్టం లేని కొందరు ఉద్యోగులు, పైస్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చి లేదా లాలూచీ పడి తమకు నచ్చిన చోట పోస్టింగ్లు పొందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా విద్యా శాఖలో డిప్యూటేషన్లు జోరుగా సాగుతున్నడంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన జరగడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వారికి ఇచ్చిన పోస్టింగ్ లో ఉండి సేవలు అందించాలని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే అనవసరమైన డిప్యూటేషన్లను రద్దు చేసి, సిబ్బందిని వారి అసలు స్థానాల్లో నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో సాగుతున్న ఈ డిప్యూటేషన్ల దందాను అరికట్టడంలో జిల్లా స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. విధులకు తూట్లు పొడుస్తున్న వారిపై చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## భక్తులకు అన్నదానం కార్యక్రమం భేష్



- **ఏరియా జీఎం దుర్గం రాంచందర్**

**మణుగూరు, విశాలభారతి:** మినీ మేడారం జాతరలో తోగ్గుడెం గ్రామం వద్ద మణుగూరు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం భేష్ అంటూ ఏరియా జీఎం దుర్గం రామ్ చందర్ అన్నారు. గురువారం మినీ మేడారం వద్ద జరిగిన రెండో రోజు అన్నదాన కార్యక్రమానికి అతిథిగా హాజరైన జిఎం దుర్గం రాంచందర్ రిబ్బన్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటెశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దారా రమేష్, పెండ్యాల విజయ భాస్కర్ లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు 14 సంవత్సరాలుగా 7వ సారి వరుసగా భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. అన్నదానం చేయడం పట్ల వాసవీ క్లబ్, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్, పినపాక నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం, మండల పట్టణ ప్రతినిధుల సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సింగరేణి సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మణుగూరు అశ్వాపురం మండల తాసిల్దార్లను, అశ్వాపురం సిఐ లను అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మణుగూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, ట్రెజరర్ సూర్యం, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కడవెండి విశ్వనాథ గుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, ఎలుగూరి నగేష్, పల్లెర్ల చంద్రశేఖర్, దారా నీరజ్, నరేంద్రుల హేమంత్, జల్లి శ్యామ్, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డకుల రాజేశ్వరరావు, దారా మల్లికార్జున రావు, ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి రాము, శివకామేశ్వరి గ్రూప్ డైరెక్టర్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ దోసపాటి నాగేశ్వరరావు, రోజా రాణి, పిచ్చేశ్వరరావు, వాసవీక్లబ్, ఆర్యవైశ్య ప్రతినిధులు బందారు నర్సింహారావు, ధర్మారావు, చిత్తలూరి రమేశ్, మోహన్ రావు, అశ్వాపురం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు స్వరాజ్యరావు, రేపాక వెంకన్న, కోటగిరి సందీప్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలి**
- **ప్రతి డివిజన్‌కు వడ్డెర సొసైటీలకు రూ. 2 కోట్ల రుణాలు**
- **వడ్డే ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ సోమరజ్**
- **ఖమ్మం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల వీరబాబు**



**ఖమ్మం, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర ప్రజల విద్య,ఉపాధి అవకాశాల అభివృద్ధి కోసం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఓడ్డె ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ సోమరాజ్ , వడ్డెర సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు డిమాండ్ చేశారు. ఖమ్మం నియోజకవర్గం అధ్యక్షులు కుంచపు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వల్లెపు సోమరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర యవతకు ఉపాధి కల్పన కోసం వడ్డెర కార్పొరేషన్ ద్వారా 70శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి జేసిపిలు, క్వారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో గత ఉమ్మడి రాష్ట్రంలో వడ్డెర సొసైటీలకు 15శాతం రిజర్వేషన్లు ఉండేవని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వడ్డెర సొసైటీల రిజర్వేషన్లను తొలగించి వడ్డెర్లకు తీరని అన్యాయం చేశారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ హామీలో భాగంగా వడ్డెర్ల వృత్తిలో భాగంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 15శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామంలో ఉన్న వడ్డెర సొసైటీలకు రెండు కోట్ల రూపాయల రుణాలను ఇవ్వాలనే డిమాండ్ తో తెలంగాణ వడ్డెర జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

## విశాలభారతి క్యాలెండర్ ఆవిష్కరణ

- **పత్రిక సేవలను కొనియాడిన - మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్**





**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుంట్లూర్ డివిజన్ మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ విశాల భారతి తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను అబ్దుల్లాపూర్మెట్ మండల ప్రతినిధి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విశాల భారతి తెలుగు దినపత్రిక ప్రస్తుతం పత్రికా రంగంలో ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వారధిగా నిలుస్తూ విశేషమైన సేవలు అందిస్తోందని ప్రశంసించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, న్యాయపోరాటాలకు దోహదపడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న విశాల భారతి యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా, డిజిటల్ మార్కెట్ రంగంలో కూడా విశాల భారతి విశేషమైన గుర్తింపును సంపాదించుకుని, ఆధునిక సాంకేతికతతో వార్తలను ప్రజలకు చేరవేస్తూ పత్రికా విలువలను నిలబెడుతోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, నిజాయితీతో కూడిన జర్నలిజాన్ని కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- **ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు**
- **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి, విశాలభారతి:** మున్సిపల్ ఎన్నికలకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని అన్నారు. ఈ కంట్రోల్ రూమ్ లో 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఫిర్యాదులను రికార్డ్ చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు మున్సిపల్ ఎన్నికలు2026కు సంబంధించి ఫిర్యాదులకై ఆమన్ గల్ కంట్రోల్ రూమ్ నెంబర్: 9032305567, చేవెళ్ళ కంట్రోల్ రూమ్ నెంబర్ 9493321468,ఇబ్రహీంపట్నం కంట్రోల్ రూమ్ నెంబర్: 9032123653,మొయినాబాద్ కంట్రోల్ రూమ్ నెంబర్: 7661097839,షాద్ నగర్ కంట్రోల్ రూమ్ నెంబర్ :9182403236,శంకర్ పల్లి కంట్రోల్ రూమ్ నెంబర్:7386755646 టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## భక్త జనంతో పోటెత్తిన మినీ మేడారం

- **గురువారం సాయంత్రం గద్దెకు చేరుకున్న సమ్మక్క**
- **రథం గుట్ట నుండి గద్దెలకు**
- **సమ్మక్క రాక కోసం బారులు తీరిన భర్త జనం**
- **జనంతో కిటకిటలాడిన రథం గుట్ట పరిసరాలు**





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని మినీ మేడారం గా ప్రసిద్ధిగాంచిన తోగూడెం లోని సమ్మక్క సారలమ్మ జాతర కన్నుల పండుగగా జరుగుతోంది. మేడారంలో వలె నిర్వహించే ఈ జాతర గిరిజన సాంప్రదాయ బద్దంగా వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఇక్కడ జాతర నిర్వాహన ఏర్పాట్లను గత నెల రోజుల నుండి చేపట్టిన సంబంధిత శాఖ అధికారులు జాతరకు హాజరయ్యే భక్త జనానికి ఎటువంటి లోటుపాట్లు జరగకుండా సకల సౌకర్యాలను సమకూర్చారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు పినపాక నియోజకవర్గం లోని కరకగూడెం, మణుగూరు, పినపాక, బూర్గంపాడు, అశ్వాపురం, గుండాల మండలాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో హాజరయ్యారు. గురువారం సమ్మక్క గద్దెకు చేరుకోవడంతో పెద్ద ఎత్తున భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరాలని మేకపోతులు, కోళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. మినీ మే డారం జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మణుగూరు పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జాతరకు పెద్ద ఎత్తున జనాలు వస్తుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ డ్రోం కెమెరాలను ఉంచి నిఘావస్థను పటిష్టపరిచారు. సమ్మక్క సారక్క ఆలయం ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక సమ్మక్క రాకతో తో గూడెం ప్రాంతమంతా గిరిజన వడ్డెలు, దేవర్లతో ఆలయ ప్రాంతమంతా భక్తి పరవశంలో మునిగిపోయింది.

## ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారుల నిర్లక్ష్యం

- **లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు**



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. కారణం తెలియకుండా బిల్లులు నిలిపివేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పోలేపాక అండాలు (భర్త: చెమ్మయ్య) అనే లబ్ధిదారురాలు ఒక్క బేస్‌మెంట్ బిల్లుగా కేవలం ఒక లక్ష రూపాయలు మాత్రమే పొందారు. అయితే గోడల బిల్లు, స్లాబ్ బిల్లు ఇప్పటివరకు విడుదల కాలేదు. మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్)ను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదని, పై అధికారులను సంప్రదిస్తే "ఏఈకి చెప్పండి" అంటూ బాధ్యతను తప్పించుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంక్ రిపోర్టులు కూడా అధికారులకు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు సకాలంలో విడుదల చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## చిత్తపురం స్టేజీ రోడ్డుపై భారీ గుంత

- **ప్రాణాల మీదకు తెచ్చే నిర్లక్ష్యం**
- **మరమ్మత్తులు చేయాలని డిమాండ్**



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం చిత్తపురం స్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన డాంబర్ రోడ్డు పక్కన భారీ గుంత ఏర్పడి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారింది .ఈ గుంత చెట్ల పొదల్లో దాగి ఉండటంతో వాహనదారులకు స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, రైతులు ప్రయాణించే ఈ మార్గంలో ఏ క్షణమైనా ప్రాణాంతక ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై చిన్నపాటి ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. రాత్రి సమయంలో గుంత కనిపించక వాహనాలు దూకి పడే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో 26 జనవరి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, నిర్వహించిన గ్రామస్థాయి వాలిబాల్ పోటీలు ఘనంగా నిలిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 3000లను నల్లప ఉదయ్ కిరణ్ నాయకత్వంలోని, జట్టు కైవసం చేసుకోగా, రెండవ బహుమతి రూ. 2000లను మేడ దుర్గాప్రసాద్ టీం సాధించింది, అలాగే మూడవ బహుమతి రూ.1000లను అంగడి రాజు అండ్ టీం గెలుచుకున్నారు. విజేత జట్లకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి చేతుల మీదుగా మొదటి బహుమతి, ఉపసర్పంచ్ జోగు అనిల్ చేతులమీదుగా రెండవ బహుమతి, గ్రామ పెద్దలు ఊట్ల శివ చేతుల మీదుగా మూడవ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొని, పోటీలను విజయవంతం చేశారు. గ్రామస్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్న నాయకులను గ్రామస్తులు అభినందించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన చౌళ్ల రామారం గ్రామస్తులు



**విశాలభారతి , అడ్డగూడూరు:** మండల పరిధిలోని చౌళ్ల రామారం గ్రామంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పంగ యాదగిరి, గూడెల్లి భాస్కర్, పంగ సోమన్న, పంగ వెంకటేష్ గురువారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురుని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మందుల సోమన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భగ్గుమంటున్న బంగారం.. సామాన్యుడికి అందని పసిడి

- **పెళ్లిళ్ల సీజన్‌లో పెరిగిన ధరలతో ప్రజల ఆందోళన**




**మర్పల్లి విశాల భారతి:** పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ బంగారం ధరలు సామాన్యుడికి అందని స్థాయికి చేరాయి. దీంతో మండలంలో బంగారం కొనుగోళ్ల మందగించాయి.హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు కొత్త రికార్డులకు చేరడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,78,200గా ఉండగా, 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,63, 350గా నమోదైంది. రోజురోజుకీ పెరుగుతున్న ధరలతో ఆభరణాల కొనుగోళ్లు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు భారీగా పెరగడంతో బంగారం కొనుగోళ్లు తగ్గాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. అయితే పెళ్లిళ్లకు బంగారం తప్పనిసరి కావడంతో ఎంతైనా కొంతమేర కొనాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని కుటుంబాలు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పెరుగుదల, డాలర్ మారకం విలువ, భౌగోళిక రాజకీయ పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

## సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇన్ఫాంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చీఫ్ మినిస్టర్ కప్ - 202526 క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, రంగారెడ్డి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు "గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి విజేతల వరకు అనే నినాదంతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, "యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి" అని అన్నారు. క్రీడా స్ఫూర్తితో నిండిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. పాఠశాల ప్రాంగణం క్రీడా ఉత్సవ వాతావరణంతో కళకళలాడింది.

# సజావుగా సాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

- **నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**విశాలభారతి, గోదావరిఖని:** పురపాలక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగుతుందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముబారక్ నగర్, సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 60 డివిజన్ లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం రామగుండంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పురపాలక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, జనవరి 31న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి సరిగ్గా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ తిరస్కరించిన అభ్యర్థులు ఫిబ్రవరి 1న సాయంత్రం 5 గంటల వరకు అప్పిల్ చేసుకునే అవకాశం ఉందని, సదరు అప్పీల్స్ ను ఫిబ్రవరి 2న పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 3 సాయంత్రం పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**దేవరుప్పుల, విశాలభారతి:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ (టీఎస్ హెచ్ఎంఏ) ఆధ్వర్యంలో రూపొందించిన స్కూల్ క్యాలెండర్‌ను గౌరవ జిల్లా కలెక్టర్ రిజ్వానా బాషా షేక్, అడిషనల్ కలెక్టర్ (డీఈవో) పింకేష్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లు సంయుక్తంగా మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలల సర్వతోముఖాభివృద్ధిలో ప్రైమరీ హెడ్మాస్టర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా జాతీయ స్థాయిలో ముందంజలో నిలిచినట్లే, రాబోయే ఎఫ్ ఎల్ ఎస్ సర్వేలో కూడా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పిఎస్ హెచ్ ఎంఎ రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ మాట్లాడుతూ, కలెక్టర్ల సూచనలు, సలహాలను అనుసరిస్తూ,తమ మార్గనిర్దేశంలో ఫిబ్రవరి 26న నిర్వహించనున్న ఎఫ్ ఎల్ ఎస్ సర్వేలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సంఘ సభ్యులంతా సమిష్టిగా కృషి చేస్తారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విద్యా నాణ్యత, ప్రగతికి పిఎస్ హెచ్ఎంఎ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారు రేణిగుంట్ల మురళి, రాష్ట్ర కౌన్సిలర్ సమ్మక్క, జిల్లా గౌరవ అధ్యక్షులు మర్యాల రమేష్, జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గైని శంకరయ్య, కోశాధికారి బుక్క శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షురాలు యన్. లలిత తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- **ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
- **జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**విశాలభారతి, వికారాబాద్ జిల్లా:** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం మరియు పంపిణీని కి అనుమతి లేదు అని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రూ.50,000/ కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని, సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

**దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని గౌరెల్లి గుట్టపై స్వయంభుగా వెలసిన శివ-కేశవుల క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేడు శుక్రవారం రోజున ఉదయం 8.00 గంటల నుంచి శివాలయంలో భక్తిశ్రద్ధలతో శివుడికి రుద్రాభిషేకము, రుద్రహోమం మరియు మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పవిత్ర కార్యక్రమాలను శ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శివాలయ దేవాలయ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని . ఈ కార్యక్రమానికి సమస్త గ్రామ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అనంతరం తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శుభకార్యానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవాలయ కమిటీ తరపున ఆయన విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ పాల్గొన్నారు.



## మేడారం జాతరలో చిలుక మధుసూదన్ రెడ్డి దంపతులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గిరిజన పండుగగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి దంపతులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ప్రాంగణంలో సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతాంగానికి మంచి పంటలు పండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన మేడారం జాతరలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.ఈ పవిత్ర కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. మేడారం జాతర గిరిజనుల ఆరాధన, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

## వీరేంద్ర చౌదరికి ప్రతిష్టాత్మక రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్స్ అవార్డు




**శేరిలింగంపల్లి, విశాలభారతి:** విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్న త్రివేణి టాలెంట్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ జి. వీరేంద్ర చౌదరిని అత్యున్నత పురస్కారం వరించింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ధృవీకరించిన,ఈయూ మీడియా ఆధ్వర్యంలో బెంగళూరు లో నిర్వహించిన 'ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ కాంక్లేవ్'లో ఆయనకు "రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్స్ అవార్డు2026 అందజేశారు. విద్యాబోధనలో వినూత్న పంథాను అనుసరిస్తూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి త్రివేణి విద్యా సంస్థలు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు.త్రివేణి టాలెంట్ స్కూల్స్ ద్వారా ఐఐటీ నీట్ ఫౌండేషన్ కోర్సులలో నాణ్యమైన విద్యను అందిస్తూ, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు."యువతను కేవలం చదువులో మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైపుణ్యాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడమే త్రివేణి విద్యా సంస్థల లక్ష్యం" అని ఈ అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ వీరేంద్ర చౌదరి తెలియచేశారు.గౌరవప్రదమైన అవార్డు దక్కడం పట్ల త్రివేణి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ డైరెక్టర్ డాక్టర్ జి. వీరేంద్ర చౌదరి గారికి అభినందనలు తెలియజేశారు.

## మూడుచింతలపల్లి 24వ డివిజన్ ఇన్చార్జిగా తుప్పత్ ఆనంద్

- **మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం బిజెపి కృషి**
- **డైవర్షన్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్ రేవంత్ సర్కార్**
- **ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**
- **బోడుప్పల్ ఈస్ట్ జోన్ ప్రధాన కార్యదర్శి, తుప్పత్ ఆనంద్**



**బోడుప్పల్, విశాలభారతి:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ ఈస్ట్ జోన్ బిజెపి ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ కు మూడుచింతలపల్లి మున్సిపాలిటీ 24వ డివిజన్ ఇన్చార్జిగా పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు చేసింది ఏమీ లేదని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు నీళ్ల మూటలేనని, ఆరు గ్యారెంటీలతో అధికారం చేపట్టి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, డైవర్షన్ పాలిటిక్స్ కేరాఫ్ అడ్రస్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని మండిపడ్డారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారు మహారాష్ట్ర బీహార్ ఎన్నికల దానికి నిదర్శనం అని, కాబోయే అన్ని ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ కాషాయం జెండా ఎగురుతుందని, మున్సిపల్ ఎన్నికలలో బిజెపి విజయ డంకా మోగించేందుకు సిద్ధమవుతుందని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులందరికీ తుప్పత్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యోగం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- **బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**



**ముషీరాబాద్, విశాలభారతి:** చదువుకున్న విద్యార్థులు యువత ఉద్యోగానికే పరిమితం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి ఆకాంక్షించారు. యువతలో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసి పరిశ్రమలు, బిజినెస్ లు ఐటీ కంపెనీలు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గురువారం నాగారంలోని జై గణేష్ రౌండింగ్ బిల్డింగ్ లో గోపగాని వంశీ మోహన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ వి మొబైల్ షాప్ ను గణేష్ చారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. యువత ఉద్యోగం కోసం అన్వేషించకుండా బిజినెస్ లో రాణిస్తూ ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధి కల్పించినప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుందని తెలిపారు. తక్కువ ధరకు మంచి సెల్ఫోన్లతో పాటు ఇక్కడ రిపేర్ సెంటర్ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు ఇలాంటి మంచి సౌకర్యాన్ని ప్రజలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, సంతోష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, వల్లబోజు నరసింహ చారి, సందీప్, శివ నారాయణ, పాపయ్య, శ్రీనివాస్, సందీప్, లక్ష్మణ్, సాయి, అజయ్, రవి నారాయణ చారి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరిన డాక్టర్ నరేష్

**రాజన్న సిరిసిల్ల , విశాలభారతి:** వేములవాడ మున్సిపల్ ఎన్నికల వేళ బిఆర్ఎస్ పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. గత కొంతకాలంగా టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న డాక్టర్ నరేష్ నేడు ఆ పార్టీకి అధికారికంగా రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ సమక్షంలో డాక్టర్ నరేష్‌కు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ నరేష్ లాంటి విద్యావంతులు, ప్రజల్లో మంచి పేరు కలిగిన నాయకులు బిజెపిలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బిజెపి పార్టీలో చేరినట్లు చెప్పారు.



# థియేటర్లలో మిస్ అయితే ఇక టెన్షన్ లేదు ..

యంగ్ హీరో రోషన్ మేకా లీడ్ రోల్‌లో నటించిన లేటెస్ట్ చిత్రం ‘ఛాంపియన్’ థియేటర్లలో విడుదలై నెల రోజులు కూడా గడవకముందే ఓటీటీలోకి వచ్చేసింది. భారీ అంచనాల మధ్య క్రిస్మస్ కానుకగా 2025 డిసెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ అయిన ఈ సినిమా, ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు ఈ చిత్రానికి ఓటీటీ వేదికగా మరో ఛాన్స్ లభించింది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాను తన ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చింది. నేటి నుంచి (జనవరి 29) ‘ఛాంపియన్’ నెట్‌ఫ్లికస్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు, లేదా మరోసారి చూడాలనుకునేవారు ఇప్పుడు ఇంట్లో కూర్చునే వీక్షించే అవకాశం లభించింది.ప్రదీప్ అద్వైతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా పీరియాడిక్ నేపథ్యంతో రూపొందింది. కథ, కథనం పరంగా కొత్తదనం ఉండటంతో మొదట్లో సినిమాపై ఆసక్తి నెలకొన్నప్పటికీ, విడుదల అనంతరం మిక్స్‌డ్ టాక్ రావడంతో థియేటర్లలో ఆశించిన రేంజ్‌లో రన్ కాలేకపోయింది. అయినప్పటికీ, ఓటీటీ ప్రేక్షకులకు ఈ సినిమా కొత్త అనుభూతిని ఇవ్వగలదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Madarapu Ashok. RNI No APTEL/2010/32877.